ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 53, పేజీలు - 08
బుధవారం, ఆగస్టు 19, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## డిజిటల్ వర్సెస్ డెమోక్రటిక్ మాస్

### - ఎవరి ప్రచారం ఎక్కువ హిట్.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో ప్రచార వ్యూహాలు రోజురోజుకూ సరికొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ స్పేస్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను వేదికగా చేసుకుని ప్రభుత్వంపై నిరంతర దాడి జరుపుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం గ్రౌండ్ రియాలిటీకే మొగ్గు చూపుతున్నారు. నెటిజన్లను ఆకట్టుకోవడం కంటే ప్రత్యక్షంగా ప్రజల్లో ఉండటమే రాజకీయంగా బలమైన ముద్ర వేస్తుందనే నమ్మకంతో, వారంలో రెండు మూడు బహిరంగ సభలు, జిల్లాల పర్యటనలతో రేవంత్ రెడ్డి ప్రజాబాహుళ్యంలో దూసుకెళ్తున్నారు.

**డిజిటల్ మీడియాలో కాంగ్రెస్ బలహీనం**

కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో బలమైన సోషల్ మీడియా ఈకో సిస్టమ్ లేకపోవడం ఒక స్పష్టమైన ప్రతికూలత. గత పదేళ్ల అధికారంలో బీఆర్ఎస్ నిర్మించుకున్న డిజిటల్ నెట్‌వర్క్, ట్రోలింగ్ , నరేటివ్ సెట్ చేసే వ్యూహాలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ సోషల్ మీడియా వింగ్ పరిమితులు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. ఈ డిజిటల్ లోపాన్ని రేవంత్ రెడ్డి తన వన్ మ్యాన్ ఆర్మీ తరహా సుడిగాలి పర్యటనలు, మాస్ ప్రసంగాలతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే విమర్శలకు ఆన్‌లైన్‌లోనే బదులివ్వడం కంటే, ప్రజల్లోకి వెళ్ళి మైక్ పట్టుకుని గర్జించడమే ఉత్తమమని ఆయన భావిస్తున్నారు.

**మాస్ డైలాగ్స్‌తో బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్న రేవంత్**

రేవంత్ రెడ్డి ప్రసంగాలు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరణకే పరిమితం కావడం లేదు. ఆయన ఉపయోగిస్తున్న మాస్ పొలిటికల్ డైలాగ్స్ , సంచలనాత్మక వ్యాఖ్యలు రాజకీయ వాతావరణాన్ని తీవ్రంగా వేడెక్కిస్తున్నాయి. బీఆర్ఎస్ నేతలు అఘోరాలతో క్షుద్ర పూజలు చేయిస్తున్నారు , సొంత పార్టీ నేతల రక్తాన్ని కూడా అమ్ముకుంటున్నారు వంటి తీవ్రమైన, వివాదాస్పద ఆరోపణలతో ఆయన వార్తల్లో నిలుస్తున్నారు. ఇటువంటి వ్యాఖ్యలు మీడియాలో, యూట్యూబ్ ఛానెళ్లలో హైలైట్ అవ్వడం ద్వారా సోషల్ మీడియాలో బీఆర్ఎస్ క్రియేట్ చేసే నరేటివ్‌ను ఒక్క దెబ్బతో తుడిచిపెట్టే వ్యూహం రేవంత్ ప్రసంగాల్లో కనిపిస్తుంది.

**డిజిటల్ క్యాంపెయిన్‌లో దూసుకెళ్తున్న బీఆర్ఎస్**

బిఆర్ఎస్ డిజిటల్ క్యాంపెయిన్ గ్రామీణ ప్రజల కంటే పట్టణ, విద్యాధికులైన ఓటర్లపై, యువతపై కొంత ప్రభావం చూపుతుంది. అయితే తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రత్యక్ష రాజకీయాలు, నాయకుడి ఫిజికల్ ప్రెజెన్స్, మాస్

2లో..

## పీఎం కేర్స్ ఫండ్‌కు రికార్డు స్థాయి నిధులు

### - రూ.8,452 కోట్లకు చేరిన కార్పస్!




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పీఎం కేర్స్ ఫండ్ నిధులు సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ నిధి మొత్తం విలువ రూ. 8,452.07 కోట్లకు వృద్ధి చెందింది. పెట్టుబడి వ్యూహాల్లో తీసుకొచ్చిన మార్పుల కారణంగానే ఈ స్థాయిలో వృద్ధి నమోదైందని తాజా ఆడిట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

2లో..

### బహుజనులు నుండి పుట్టుకొచ్చిన
## వీరుడు సర్వాయి పాపన్న

### - ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఇది బహుజనుల తెలంగాణ అని, తమ ఇందిరమ్మ పాలనలో సామాజిక న్యాయం, జీవించే స్వేచ్ఛ ఉందని నిరూపించామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో కొడుకు, బిడ్డకు పదవులివ్వగా.. బీసీలకు పదవులిచ్చి గౌరవించుకున్న ప్రభుత్వం తమదన్నారు. సందర్శకులు ట్యాంక్ బండ్ పైకి వచ్చినప్పుడు పాపన్న గౌడ్ దర్శనంతో వారిలో స్ఫూర్తి నిండాలనేది తమ సంకల్పమని చెప్పారు. అలాగే నెక్లెస్ రోడ్డులో జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే విగ్రహాలను కూడా ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిపారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ గౌడ సోదరుల సుదీర్ఘ నిరీక్షణకు ఫలితంగా, నెక్లెస్ రోడ్డులోని పర్యాటక కార్యాలయాన్ని తొలగించి మరి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని

2లో..

### పెట్టుబడుల్లో
## ఏపీ దూకుడు

### దేశంలోనే 2వ స్థానం

- చంద్రబాబు విజన్ వల్లేనన్న మంత్రి లోకేశ్




**అమరావతి (ప్రశ్న న్యూస్)** నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానానికి చేరుకుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కేవలం 24 నెలల వ్యవధిలోనే రాష్ట్రం 9వ స్థానం నుంచి 2వ స్థానానికి ఎగబాకిందని ఆయన వెల్లడించారు. ఈ ఘనత ముఖ్యమంత్రి

2లో..

## బీసీ రిజర్వేషన్లు, ప్రత్యక్ష ఎన్నికలకు ఆమోదం!

### - ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు



- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు ఆమోదం
- పట్టణ స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్
- డెడికేటెడ్ కమిషన్ నివేదికపై లోతుగా చర్చించి నిర్ణయం
- సుమారు 55కు పైగా అజెండా అంశాలపై కేబినెట్‌లో సమీక్ష

**అమరావతి (ప్రశ్న న్యూస్)** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం, పట్టణ ప్రాంతాలలో 33.1 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ కేబినెట్ భేటీలో నిర్ణయించారు.



2లో..

## భూమి లేని నిరుపేదలకు ఎకరం భూమి ఇస్తాం

### - 'భూ లక్ష్మి పథకం' ప్రకటించిన కల్వకుంట్ల కవిత




- భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత
- రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ
- రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో తెలంగాణ రక్షణ సేన పార్టీ (టీఆర్ఎస్) అధికారంలోకి వస్తే భూమి లేని నిరుపేదలకు కుటుంబానికి ఎకరం చొప్పున భూమి పంపిణీ చేస్తామని ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటించారు. 'భూ లక్ష్మి పథకం' పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని ఆమె తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత పేదలు, ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు భూమి ఎంతో కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ రక్షణ సేనకు అధికారాన్ని కట్టబెడితే భూమి లేని పేద కుటుంబాలను గుర్తించి ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి అందిస్తామని హామీ ఇచ్చారు.

2లో..

## బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

### - అసెంబ్లీలో ప్రసంగించిన సీఎం చంద్రబాబు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణపై ఎవరైనా కోర్టుకు వెళ్లి కేసులు వేస్తే, వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని అడ్డుకోవాలని చూసే శక్తులను ప్రజానీకం, చరిత్ర క్షమించవని

2లో..

### రబ్బరు చెప్పులతో వచ్చి
## సంపాదించినవాడ్ని కాదు

### - 22ఏ భూముల వివాదంపై పొంగులేటి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 22ఏ నిషేధిత భూముల జాబితాలో అధికారుల పొరపాట్ల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అయితే ఈ సమస్యను ప్రభుత్వం ఇప్పటికే పరిష్కరిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ జాబితాలోని 5కి పైగా భూముల రిజిస్ట్రేషన్లు నిన్న పూర్తయ్యాయని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యలను అర్థం చేసుకుంటామన్నారు. ఈ అంశంపై అధికారులతో ప్రత్యేక కమిటీ వేశామని, ఈ నెలాఖరు నాటికి 22ఏ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు.
పదేళ్లు అధికారంలో ఉన్న హరీష్ రావు 30% కమిషన్ల వ్యవహారాన్ని ఇంకా మర్చిపోలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయినప్పుడు ఆయన ఎందుకు బాధ్యత తీసుకోలేదని

2లో..

### ఈసీ లక్షలాది ఓట్లను
## తొలగించింది

### - మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణలు

- సుమారు 73 లక్షల ఓట్లు తొలగించారన్న మహేశ్ కుమార్ గౌడ్
- బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని విమర్శ
- ఈసీని కేంద్రం పాకెట్ సంస్థగా మార్చిందంటూ వ్యాఖ్య



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ద్వారా ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా లక్షలాది ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల

2లో..

### మంత్రి పొంగులేటి తక్షణమే
## రాజీనామా చేయాలి

### - పెద్ద తప్పు చేసి క్షమాపణల చెబితే ప్రజల బాధలు తీరవని వ్యాఖ్య



2లో..

## హుస్సేన్ సాగర్ పునరుజ్జీవనానికి హెచ్ఎండీఏ బిగ్ ప్లాన్

### - మారనున్న లేక్ ఫ్రంట్ రూపురేఖలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మహానగరానికి ప్రతీకగా, చారిత్రక సాక్ష్యంగా నిలిచే హుస్సేన్‌సాగర్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు హెచ్ఎండీఏ సమగ్ర కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఒకప్పుడు నగరవాసులకు తాగునీటిని అందించిన ఈ జలాశయం, కాలక్రమేణా పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీటి ప్రవాహం, నిర్వహణ లోపాలతో తన సహజ సౌందర్యాన్ని కోల్పోయింది. ఈ పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపుతూ, పర్యావరణాన్ని కాపాడటంతో పాటు పర్యాటకులకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించేందుకు హెచ్ఎండీఏ ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన చేస్తోంది. ఈ మాస్టర్ ప్లాన్ తయారీ కోసం అర్హత కలిగిన కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేసేందుకు మరో వారం పది రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.
హుస్సేన్ సాగర్ పునరుజ్జీవనంలో అత్యంత కీలకమైన



2లో..

# భూమి లేని నిరుపేదలకు ఎకరం భూమి ఇస్తాం

అన్యాక్రాంతమైన భూములతోపాటు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను సేకరించి నిరుపేదలకు పంపిణీ చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భూమి పంపిణీ చేయాల్సిన అవసరం ఉందని పేదలకు భూమిపై హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల పేరుతో ముందుగా అసైన్డ్ భూములనే తీసుకుంటున్నారని కవిత ఆరోపించారు. సుమారు 30 వేల అసైన్డ్ భూములను ప్రభుత్వం లాక్కుందని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పేదల అసైన్డ్ భూములపై వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. పేదల భూములను లాక్కుంటే చూస్తూ ఊరుకోబోమని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి భూమిని కేవలం వాణిజ్య లావాదేవీగా చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కూడా పేదలకు భూమి పంపిణీ జరిగిందని ఆ తర్వాత ఆ ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలోని భూములను గుర్తించి పేదలకు పంపిణీ చేయడం సాధ్యమేనని కవిత తేల్చి చెప్పారు. సామాజిక న్యాయం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడుతున్నప్పటికీ అది ఆచరణలో కనిపించడం లేదని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం దక్కడం లేదని విమర్శించారు. ప్రభుత్వ సలహాదారుల నియామకాలు, వారి జీతాల్లోనూ సామాజిక న్యాయం కనిపించడం లేదని పేర్కొన్నారు. ఆర్టీఐ కమిషన్‌లో బీసీలకు ప్రాతినిధ్యం లేదని ఆరోపించారు.రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం అయితే.. ఆచరణలో మాత్రం అటవిక న్యాయం కొనసాగుతోందని కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఉన్నత వర్గాలకు ఒక న్యాయం పేదలకు మరో న్యాయం అన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వ తీరు కొనసాగుతోందని ఆరోపించారు. ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని కూడా విమర్శించారు. కాగా, పేదలకు భూమి పంపిణీతో పాటు అసైన్డ్ భూములపై హక్కుల అంశాన్ని కూడా కవిత తన రాజకీయ కార్యాచరణలో ప్రధానంగా ప్రస్తావించారు.

# బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

ఆయన స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రసంగించిన ఆయన, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, తమ ప్రభుత్వ లక్ష్యాలను సవివరంగా ప్రకటించారు.

### కూటమి కేబినెట్ కీలక నిర్ణయాలు

బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం రాష్ట్ర మంత్రివర్గం మూడు కీలక నిర్ణయాలు తీసుకుందని చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దీంతో పాటు, పట్టణాల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించామని, ఇది 'ఆయారాం గయారాం' రాజకీయాలకు తెరదించి, సుస్థిరమైన పాలనకు దోహదపడుతుందని వివరించారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలోని 28 జిల్లాలకు అనుగుణంగా 28 జిల్లా ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

### ఎన్టీఆర్ స్ఫూర్తితో బీసీలకు న్యాయం

బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలుగుదేశం పార్టీకి ముందు, ఆ తర్వాత అని స్పష్టంగా చూడవచ్చని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాతే బీసీలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. 1984లో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితోనే తాను 1995లో ముఖ్యమంత్రిగా యాక్ట్ ఆఫ్ 5 కింద బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించానని, 2013 వరకు జరిగిన అన్ని స్థానిక ఎన్నికల్లో ఇదే కోటాను అమలు చేశామని తెలిపారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, దేవేందర్ గౌడ్ వంటి ఎందరో బీసీ నేతలు టీడీపీ ద్వారానే బలమైన నాయకులుగా ఎదిగారని ఉదహరించారు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అదే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళుతోందని చెప్పారు.

### గత ప్రభుత్వ ద్రోహాన్ని ఎండగట్టిన సీఎం

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని చంద్రబాబు తీవ్రంగా ఆరోపించారు. 2019లో జీవో 176 తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీంకోర్టులో సరిగ్గా వాదనలు వినిపించకుండా బీసీల హక్కులను కాలరాశారని విమర్శించారు. జీవోలు 559, 560 ద్వారా 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24.15 శాతానికి తగ్గించి, తద్వారా సుమారు 16,800 బీసీ నాయకత్వ స్థానాలు కోల్పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "బీసీలకు ద్రోహం చేయటంలో వాళ్లు నెంబర్ వన్" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.గత ప్రభుత్వం బీసీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని చంద్రబాబు ఆరోపించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించారని గుర్తుచేశారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టడం, తోట చంద్రయ్య గొంతు కోయడం, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య హత్యల వంటి దారుణాలను ప్రస్తావిస్తూ.. వారు సిద్ధాంతాల కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని దుయ్యబట్టారు.

### బీసీల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళిక

తమ ప్రభుత్వం బీసీలకు కేవలం రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా, వారి సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. "బీసీ అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు" అని అభివర్ణించారు. రాష్ట్ర జనాభాలో 50.54 శాతంగా ఉన్న బీసీల విద్య, నైపుణ్యం, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని, వారి అద్భుతమైన నైపుణ్యాలకు టెక్నాలజీని జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామని హామీ ఇచ్చారు.

### ఎన్నికలు తక్షణావసరం

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికలు నిర్వహిస్తేనే 16వ ఆర్థిక సంఘం నుంచి గ్రామీణ ప్రాంతాలకు రూ.2300 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.1,562 కోట్ల గ్రాంట్లు వస్తాయని వివరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికి వైసీపీ సభ్యులు హాజరు కాకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ చారిత్రక నిర్ణయానికి సభ ఆమోదం తెలపాలని కోరుతూ, స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలని పిలుపునిచ్చారు.

# సీజనల్ వ్యాధుల పట్ల పశు యజమానులు అప్రమత్తంగా ఉండాలి

- పశువైద్యాధికారి బాలకృష్ణ
- రాంపురం,రాంపురం కొట్టాలలో లంపి చర్మ వ్యాధి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహణ.



**తుగ్గలి** పాడి పశువులకు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పశు యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి బాలకృష్ణ తెలియజేశారు. మంగళవారం రోజున రాంపురం, రాంపురం కొట్టాల గ్రామాలలో లంపి చర్మ వ్యాధి నిరధక టీకాల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పశువైద్యాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి బాలకృష్ణ మాట్లాడుతూ పాడి రైతులకు కరువు నివారణకు పశు గ్రాసాల పెంపకం చేపట్టాలని,కరువు నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న హరిత గోపాలం పథకం, సబ్సిడీతో పశు గ్రాసాల విత్తనాల సరఫరా,నీటి చెరువులో పశు గ్రాసాల పెంపకం గురించి పశు యజమానులకు వారు వివరించారు. వాణిజ్య పంటలతో పాటు పశువులకు మేతగా ఉపయోగపడే పంటలు కూడా వేయాలని వంటి తగు సూచనలను వివరించారు.పాడి రైతులు మరియు జీవాల పెంపకందారులు వర్షాకాలంలో వచ్చే జబ్బులు తమ పశువులను సోకకుండా చిటిక రోగం,నీలి నాలుక వ్యాధి,జబ్బ రోగం,దొమ్మ రోగం,లంపి చర్మ వ్యాధి నిరధక టీకాలు అందుబాటులో ఉన్నాయని,రైతులు టీకాల కోసం తమ దగ్గరలోని రైతు సేవ కేంద్రం లేదా పశు వైద్యశాల సిబ్బందిని సంప్రదించాలని పశు వైద్యాధికారి బాలకృష్ణ తెలియజేశారు.

# డిజిటల్ వర్సెస్ డెమోక్రటిక్ మాస్

కనెక్టివిటీనే విజయావకాశాలను నిర్దేశిస్తాయి. రేవంత్ రెడ్డి సరిగ్గా ఈ పాయింట్‌నే క్యాచ్ చేశారు. సీఎం హోదాలో స్వయంగా వచ్చి మాట్లాడటం, ప్రతిపక్షాలపై నేరుగా విరుచుకుపడటం వల్ల క్షేత్రస్థాయి కార్యకర్తలలో ఉత్సాహం నిండటమే కాకుండా, సాధారణ ప్రజల్లో ప్రభుత్వం పనిచేస్తోందనే భావన బలంగా నాటుకుపోతుంది. రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఈ 'తీవ్ర వ్యాఖ్యల' వ్యూహంలో కొన్ని ముప్పులు కూడా ఉన్నాయి. నిరంతరం వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వల్ల సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు వంటి ప్రధాన అంశాలు పక్కదారి పట్టే ప్రమాదం ఉంది.

### ఎవరిది పైచేయి?

అంతేకాకుండా, బీఆర్ఎస్ డిజిటల్ టీమ్ రేవంత్ మాట్లాడే ప్రతి మాస్ డైలాగ్‌ను కట్ చేసి, సోషల్ మీడియాలో ట్రోల్ చేయడం ద్వారా ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచేందుకు ప్రయత్నిస్తోంది. దీర్ఘకాలంలో కాంగ్రెస్ కూడా తన డిజిటల్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకోకపోతే, కేవలం సీఎం పర్యటనలపైనే ఆధారపడటం కష్టమవుతుంది. ప్రచార హోరాహోరీలో బీఆర్ఎస్ ఆన్-స్క్రీన్ ఆధిక్యత ప్రదర్శిస్తుంటే, రేవంత్ రెడ్డి ఆన్-గ్రౌండ్ ప్రాబల్యాన్ని చాటుకుంటున్నారు. డిజిటల్ మీడియా ఇచ్చే పబ్లిసిటీ తాత్కాలికమైనదే అయినప్పటికీ, ప్రజల్లోకి వెళ్లి నేరుగా వేసే ముద్ర ఎన్నికల రాజకీయాల్లో ఎక్కువ కాలం నిలుస్తుంది. కాబట్టి ప్రస్తుతానికి బిఆర్ఎస్ డిజిటల్ దాడి కంటే, రేవంత్ రెడ్డి ప్రత్యక్ష మాస్ అటాక్, సుడిగాలి పర్యటనలే రాజకీయంగా ఎక్కువ మైలేజ్ ఇస్తున్నాయని చెప్పవచ్చు.

# బహుజనులు నుండి పుట్టుకొచ్చిన వీరుడు సర్వాయి పాపన్న

వెల్లడించారు.

### గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన మహా వీరుడని, ఆయన తన కుటుంబం కోసమే కాకుండా బహుజనులతో కలిసి దండయాత్ర చేసి గోల్కొండ కోటపై జెండాను ఎగురవేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీకి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారో, తెలంగాణలో పాపన్న గౌడ్‌కు బహుజనులు అంతే ప్రాధాన్యం ఇస్తారని స్పష్టం చేశారు. బ్రిటిష్ లైబ్రరీలోని ఆధారాల ద్వారా ఆయన పోరాట పటపటిమను నేటి తరం తెలుసుకుందని, బహుజనుల కోసం జీవితాన్ని అంకితం చేయడం వల్లే వందల ఏళ్లు గడిచినా ఆయన కీర్తి నిలిచి ఉందన్నారు. తెలంగాణ అమరవీరుల స్థూపం స్థాయిలోనే ఈ విగ్రహానికి ప్రాధాన్యత ఉంటుందని, ఈ ప్రతిమను కాపాడుకునే బాధ్యత గౌడ సోదరులదేనని, నిత్యం కాంతులీనేలా లైటింగ్, అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.ఇదే వేదికపై పాలమూరు వీరుడు పండుగ సాయన్న పోరాట పౌరుషాన్ని గుర్తుచేస్తూ, అక్టోబర్ 22న ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ బాలా గౌడ్, మల్లికార్జున్ గౌడ్ వంటి నేతలను అందించిన చరిత్ర కలిగినదని, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేష్ గౌడ్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తాము కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తామని, దీనికి గౌడ సోదరులు 100 శాతం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గీత కార్మికుల వృత్తిని రక్షించేందుకు అర్హులైన వారందరికీ పింఛన్లు ఇవ్వాలని ఆదేశించామన్నారు. రూ.50 వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేయడంతో పాటు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షల పరిహారం అందిస్తున్నామని చెప్పారు. అలాగే ప్రభుత్వ భూములు, కాలువ గట్లపై ఈత, తాటి చెట్లను విస్తృతంగా నాటాలని నిర్ణయించామని తెలిపారు.

### కులవృత్తులను గౌరవిస్తూనే డాక్టర్లు, ఇంజనీర్లుగా చేయండి

పిల్లలను చదివించి గొప్ప వారిని చేయడమే ఏకైక మార్గమని సీఎం రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. కులవృత్తులను గౌరవిస్తూనే, పిల్లలను చదివించి డాక్టర్లు, లాయర్లు, ఐఏఎస్‌లుగా తీర్చిదిద్దాలని, చదువుల వల్లనే మధుయాష్కీ గౌడ్ అమెరికా వెళ్లారని, ఆ తర్వాత ఎంపీ కాగలిగారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం, రాగిజావ, పాలు, నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నామని చెప్పారు. ఏటీసీల్లో చేరే విద్యార్థులకు నెలకు రూ. 2 వేల స్టైపెండ్ ఇస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా సమగ్ర పాఠశాలలు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

### కేసీఆర్ కొడుకు, బిడ్డలకు పదవులు.. మనం బీసీలకు పదవులిచ్చాం..

గతంలో బీఆర్ఎస్ కేసీఆర్ పాలనకు, తమ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. కేసీఆర్‌ది కుటుంబ న్యాయం అయితే తమది సామాజిక న్యాయమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేసీఆర్ తన కొడుకు, అల్లుడు, బిడ్డ, బావమర్దులకు పదవులు ఇచ్చుకుంటే, తమ ప్రభుత్వంలో పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, వాకిటి శ్రీహరిలకు మంత్రిపదవులు, అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డిలకు రాజ్యసభ, చాకలి ఐలమ్మ మనుమరాలికి, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు మహిళా కమిషన్ సభ్యత్వాలు, కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చామని చెప్పారు.

కేసీఆర్ రూ. 8.11 లక్షల కోట్ల అప్పులు చేసి పెట్టినందున, ఏడాదికి రూ. 75 వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని, అయినా కూడా తాము రూ. 36 వేల కోట్ల రైతు భరోసా, రూ. 95 వేల కోట్ల ధాన్యం కొనుగోలు, మహిళా సంఘాలకు రూ. 60 వేల కోట్ల బ్యాంకు రుణాలు అందించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తోందని పేర్కొన్నారు. విపక్షాలు అసత్యాలతో దాడి చేస్తున్నాయని, చేతబడి పూజలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ ప్రభుత్వం పేదలదని, ప్రతి ఒక్కరూ ఆలోచించి మద్దతుగా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

# పీఎం కేర్స్ ఫండ్‌కు రికార్డు స్థాయి నిధులు

ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ. 7,173.03 కోట్లుగా ఉన్న నిధులు, ఏడాది ముగిసే సమయానికి గణనీయంగా పెరిగాయి. గతంలో నిధులన్నీ అధికంగా సేవింగ్స్ ఖాతాల్లోనే ఉండగా, ఇప్పుడు మెరుగైన రాబడి కోసం వాటిని ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మళ్లించారు. ప్రస్తుతం మొత్తం నిధుల్లో రూ. 6,641 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండగా, కేవలం రూ. 605.41 కోట్లు మాత్రమే సేవింగ్స్ ఖాతాల్లో ఉన్నాయి. అంటే పీఎం కేర్స్ మొత్తం నిధుల్లో దాదాపు 92.8 శాతం ఎఫ్‌డీలలోనే ఉన్నాయి.

ఓ గడిచిన ఏడాదిలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా రూ. 469.38 కోట్ల వడ్డీ లభించగా, సేవింగ్స్ ఖాతాల ద్వారా కేవలం రూ. 5.77 కోట్లు మాత్రమే సమకూరింది. వీటితో పాటు స్వదేశీ విరాళాల రూపంలో రూ. 479.04 కోట్లు, విదేశీ విరాళాల రూపంలో రూ. 92.83 లక్షలు అందాయి. వివిధ ఏజెన్సీల నుంచి మరో రూ. 324.66 కోట్ల రిఫండ్‌లు కూడా ఈ ఖాతాలో చేరాయి. కొవిడ్-19 మహమ్మారి విజృంభించిన తరుణంలో, 2020 మార్చి 27న పీఎం కేర్స్ ఫండ్‌ను ఒక పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విపత్కర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిధి ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ఈ ఫండ్ ద్వారా కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు చేయూతనిచ్చే 'పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్' పథకం కింద వ్యయం చేస్తున్నారు.

# రబ్బరు చెప్పులతో వచ్చి సంపాదించినవాడ్ని కాదు

మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. అబద్ధాలతో అధికారంలోకి రావాలనుకుంటున్న అగ్గిపెట్టె రావు కల ఎప్పటికీ పగటికలగానే మిగిలిపోవడం ఖాయమంటూ ఎద్దేవా చేశారు. తాను బాధ్యతగల మంత్రిగా సమస్యలను పరిష్కరిస్తున్నానని స్పష్టం చేశారు.

బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, ఆయన వద్ద ఏవైనా ఆధారాలు ఉంటే బయటపెట్టాలని ఛాలెంజ్ చేశారు. ఫీనిక్స్, రాఘవ కంపెనీల మధ్య వ్యాపార లావాదేవీలు సాధారణంగానే జరుగుతాయని పేర్కొన్నారు. తాను 20 ఏళ్లుగా వ్యాపార రంగంలో ఉంటూ అంచలంచెలుగా ఎదుగుతూ మంత్రి స్థాయికి వచ్చానని, రబ్బరు చెప్పులతో వచ్చి వేల కోట్లు సంపాదించలేదని వ్యాఖ్యానించారు.

నిషేధిత (22ఏ) జాబితాలో ప్రైవేటు భూములు చేరడానికి అధికారుల పొరపాట్లే ప్రధాన కారణమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి జీవోలు, మెమోల ద్వారా హక్కులు పొందిన భూ రికార్డులను, కోర్టు ఆదేశాలను సరిగ్గా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోవడం వల్ల ఈ సమస్య ఎదురైందని క్లారిటీ ఇచ్చారు. గతేడాది హైకోర్టు సూచనల మేరకు జాబితాను ఆన్‌లైన్ చేసినప్పుడు పాత రికార్డులే ఉండటంతో ప్రైవేటు ఆస్తులు నిషేధిత పరిధిలోకి వెళ్లాయి. ఇటీవల భూ రిజిస్ట్రేషన్ల ప్రక్షాళన సమయంలో పన్నులు చెల్లించిన భూములను కూడా రిజిస్టర్ చేసేందుకు అధికారులు నిరాకరించడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. దీనిని ప్రభుత్వం సరిదిద్దుతోందని మంత్రి స్పష్టం చేశారు.

# బీసీ రిజర్వేషన్లు, ప్రత్యక్ష ఎన్నికలకు ఆమోదం!

అలాగే మేయర్లకు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీ మంగళవారం జరిగింది. ఈ భేటీలో 55కి పైగా అంశాలపై చర్చించిన మంత్రివర్గం పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఆర్థిక సంఘం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 16 వేల 500 కోట్ల రూపాయలు నిధులు రావాల్సి ఉంది. ఈ నిధులు మురిగిపోకుండా ఉండాలంటే స్థానిక సంస్థలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ నెలలోగా ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.అలాగే మేయర్‌ను ప్రజలే నేరుగా ఎన్నుకునేలా ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. వీటితో పాటుగా కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టును కేబినెట్ ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో అక్షత్ గ్రీన్ టెక్ సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంటుతో పాటు డేటా సెంటర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటితో పాటుగా కాకినాడ, సూర్యలంక, తిరుపతి, కేశరపల్లిలో స్టార్ హోటల్స్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన వర్గాల స్థితిగతులను అధ్యయనం చేయటం సహా బీసీ రిజర్వేషన్ల ఖరారుకు రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్‌రంజన్ మిశ్ర నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిషన్ ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబుకు తన నివేదిక సమర్పించింది. సమగ్ర కుటుంబ సర్వేను ప్రాతిపదికగా తీసుకుని కమిషన్ పరిశీలన జరిపింది. రాజీవ్ రంజన్ మిశ్ర కమిషన్ ప్రకారం ఏపీలో బీసీల జనాభా సుమారు 50.50 శాతంగాఉంది.

కమిషన్ నివేదిక అందిన అనంతరం సీఎం చంద్రబాబు సోమవారం రోజున సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో చర్చలు జరిపారు. న్యాయ నిపుణులతోనూ సమీక్షించారు. అనంతరం మంగళవారం ఉదయం జరిగిన మంత్రివర్గ సమావేశంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే స్థానిక సంస్థలకు అక్టోబరులోగా ఎన్నికలు నిర్వహించాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది.

# మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో జరిగిన పెద్ద తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు.ఆభూములను నిషేధిత జాబితాలో పెట్టింది ప్రభుత్వమే కాబట్టి, ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకోకుండా వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్సీని రద్దు చేయడంతో ఆ స్థలాలు పట్టా భూములుగా మారాయని అలాగే జీఓల ద్వారా మినహాయింపు పొందిన హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా ఇప్పుడు 22ఏ లో చేర్చి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి పథకం 'సంతానలక్ష్మి'గా మారిపోయిందని, పెళ్లి సమయానికి అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత గానీ రావడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేసిన కాంగ్రెస్ నేతలను చట్టపరంగా బాధ్యులను చేస్తామని హెచ్చరిస్తూ, 22ఏ భూముల అంశంపై కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీ వేదికగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

# హుస్సేన్ సాగర్ పునరుజ్జీవనానికి హెచ్ఎండీఏ బిగ్ ప్లాన్

అంశం కాలుష్య నియంత్రణ. వివిధ నాలాల ద్వారా సాగర్‌లోకి మురుగు చేరకుండా నిరోధించేందుకు ప్రస్తుతం ఉన్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల సామర్థ్యాన్ని, నిర్వహణను మరింత బలోపేతం చేయనున్నారు. కొత్త మురుగు మళ్లింపు పైపులైన్లతో పాటు గ్రీన్ స్కేపింగ్, పర్యావరణహిత అర్బన్ డిజైన్లను అమలు చేసి సాగర్ నీటిని స్వచ్ఛందంగా మార్చటమే లక్ష్యంగా పెట్టుకున్నారు. సుందరీకరణలో భాగంగా సంజీవయ్య పార్కును ప్రత్యేకంగా తీర్చిదిద్దనున్నారు. గతంలో నగరవాసులను ఆకట్టుకొని ప్రస్తుతం కనుమరుగైన రోజ్ గార్డెన్ స్థానంలో కొత్త థీమ్ గార్డెన్లు, వనాలను అభివృద్ధి చేస్తారు. ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులలో పర్యావరణం, ప్రకృతి, హైదరాబాద్ నగర చరిత్రపై అవగాహన పెంచేలా ఒక అధునాతన లెర్నింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. లేక్‌ఫ్రంట్ పరిసరాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో సందర్శకులు ఆహ్లాదకరంగా గడిపేలా సైక్లింగ్ ట్రాక్‌లు, వాకింగ్ పాత్‌లు, యోగా సెంటర్లు, డిజైనర్ ఫుడ్ కోర్టులు నిర్మిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ఓపెన్ ఎయిర్‌ప్లాజాలు రూపుదిద్దుకోనున్నాయి. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, పీవీ నరసింహారావు మార్గ్, లుంబినీ పార్క్, పీపుల్స్ ప్లాజా, అంబేడ్కర్ విగ్రహం, అమరవీరుల స్మారక చిహ్నం పరిసరాలను అనుసంధానిస్తూ సుందరీకరణ పనులు చేపడతారు. పర్యాటకుల రద్దీకి తగ్గట్లుగా రోడ్ల వెడల్పు, విశాలమైన పార్కింగ్ సదుపాయాలు కల్పించనున్నారు. కొంతకాలంగా కళతప్పిన ఎన్టీఆర్ గార్డెన్స్, లుంబినీ పార్కులను ఆధునిక సాంకేతికతతో రీడిజైన్ చేయనున్నారు. ముఖ్యంగా లుంబినీ పార్కులోని లేజర్ షోను సరికొత్త థీమ్‌లతో, అత్యంత ఆకర్షణీయంగా పునర్మించనున్నారు. ఈ ప్రణాళికలు పూర్తిగా అమల్లోకి వస్తే హుస్సేన్‌సాగర్ కేవలం పర్యాటక ప్రాంతంగానే కాకుండా పర్యావరణ పరిరక్షణకు, కుటుంబ సమేత వినోదానికి వేదికగా నిలిచి హైదరాబాద్ గ్రేటర్ నగరానికే తలమానికంగా మారనుంది.

# ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది

సంఘం ఇటీవల విడుదల చేసిన సర్ ముసాయిదా జాబితాపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) సరిగ్గా ఇళ్లను సందర్శించకుండానే పేదలు, వలస కూలీల ఓట్లను అత్యధికంగా డిలీట్ చేశారని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలోనే ఎన్నికల సంఘాన్ని కూడా తమ అధీనంలోని సంస్థగా మార్చుకుందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ప్రాతిపదికగా మార్పులు చేయడంపై స్పందిస్తూ, ఆ వివరాలు ప్రస్తుతం ఎంతమందికి అందుబాటులో ఉన్నాయని ప్రశ్నించారు. నియోజకవర్గాల డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పుల వల్ల పాత వివరాలు సక్రమంగా లేవని, 2002 జాబితాతో ముడిపెట్టకుండా పౌరులకు నేరుగా ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. అకారణంగా 73 లక్షల ఓట్లను తొలగించి, మొత్తం 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేయడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

### వివాదాస్పద కాంగ్రెస్ నేతలపై అధిష్టానం చర్యలు తీసుకుంటుంది

నల్గొండ, వనపర్తి కాంగ్రెస్ పంచాయితీ ముదిరి హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు చేరింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జి. చిన్నారెడ్డికి వ్యతిరేకంగా వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి అనుచరులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. "చిన్నారెడ్డి హటావో, కాంగ్రెస్ బచావో" అంటూ గాంధీ భవన్ ప్రాంగణంలో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలిపారు. గతంలో ఎమ్మెల్యే టికెట్లను అమ్ముకున్నారంటూ చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి చిన్నారెడ్డిపై అధికారికంగా ఫిర్యాదు చేశారు. చిన్నారెడ్డి ఆరోపణలు పార్టీ వర్గాల్లో తీవ్ర దుమారం రేపిన ఈ ఫిర్యాదు ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. పార్టీ ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోందని, పరిశీలించిన తర్వాత తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అలాగే ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, మేఘా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డిలకు సంబంధించిన అంశాలన్నింటినీ పార్టీ క్రమశిక్షణా కమిటీ సమగ్రంగా పరిశీలిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# పెట్టుబడుల్లో ఏపీ దూకుడు

చంద్రబాబు దార్శనిక నాయకత్వం వల్లే సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, పారదర్శక పాలన, వ్యాపార నిర్వహణలో వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి" అని వివరించారు. రాష్ట్రం వేగంగా పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుండటం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సానుకూల వాతావరణంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలను అందిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచం చూపు ఏపీ వైపు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# ప్రతి వర్గానికీ అండగా కొల్లి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

## - విద్య నుంచి ఉపాధి వరకు మౌలిక సదుపాయ ఏర్పాటు - జిల్లాలో ఘనంగా కల్పనా చౌదరి జన్మదిన వేడుకలు




కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కొల్లి కల్పనా చౌదరి జన్మదిన వేడుకలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు సేవా కార్యక్రమాల మధ్య ఘనంగా జరిగాయి. పుట్టినరోజు సందర్భంగా ఆమె పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం జగన్నాథపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కల్పనా చౌదరి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రత, విద్యా సామగ్రి తదితర మౌలిక వసతులపై ప్రధానోపాధ్యాయురాలు లతను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కొల్లి ఫౌండేషన్ తరఫున తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు పూలజల్లులతో ఆమెకు స్వాగతం పలికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ






చుంచుపల్లి మండలం రాంపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు బాలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయని పేర్కొన్నారు.కల్పనా చౌదరి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ ఉందని, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. రానున్న రోజుల్లో ఫౌండేషన్ సేవలను మరింత విస్తరిస్తామని తెలిపారు.

### ఏజెన్సీ విద్యార్థులకు చేయూత

సుజాతనగర్ మండలం స్టేషన్ బేతంపుడిలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి కూడా సహకరిస్తామని కల్పనా చౌదరి హామీ ఇచ్చారు.స్థానిక సర్పంచ్ వాంకుడోత్ శ్రీకాంత్ నాయక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు అండగా నిలుస్తూ, పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలకు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కల్పనా చౌదరి ఆకాంక్షించారు.

### ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాల పంపిణీ

కొత్తగూడెంలో ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్‌తో కలిసి కల్పనా చౌదరి ఆటో డ్రైవర్లకు చొక్కాలను అందజేశారు. ఈ సందర్భంగా కల్పనా చౌదరి మాట్లాడుతూ ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజలకు రవాణా సేవలు అందిస్తున్న ఆటో డ్రైవర్ల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్ మాట్లాడుతూ ‘పే బ్యాక్ టు సొసైటీ’ స్ఫూర్తితో వివిధ వర్గాల ప్రజలకు సేవలు అందిస్తున్న కొల్లి ఫౌండేషన్ కార్యక్రమాలు అభినందనీయమన్నారు.

### లబ్ధిదారుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

లక్ష్మీదేవిపల్లి మండలంలో కొల్లి ఫౌండేషన్ ద్వారా ఉచిత టైలరింగ్ శిక్షణ పొంది కుట్టుమిషన్లు అందుకున్న లబ్ధిదారులు కల్పనా చౌదరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కల్పనా చౌదరి మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ ఫౌండేషన్ సేవలను మరింత విస్తరిస్తామని అన్నారు.



పేదలు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, నిరుపేద కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమాల్లో ఫౌండేషన్ కో-ఆర్డినేటర్లు రూప్లా నాయక్, ఉపేందర్ నాయక్, ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆటో డ్రైవర్లు, ఫౌండేషన్ లబ్ధిదారులు, అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు

# విద్యారంగ సమస్యలపై పోరాటం

## -ఎస్ఎఫ్ఐ - ఆత్మకూరు ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులుగా సయ్యద్ ఇస్మాయిల్ ఎ. సాయికుమార్

**ఆత్మకూరు** పట్టణంలోని స్థానిక డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్ నందు మంగళవారం నాడు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగిందని ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ఆర్ నాయక్ ఉపాధ్యక్షులు కే దినేష్ కుమార్ లు అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తామని వారు డిమాండ్ చేశారు విద్యారంగా సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మారిన విద్యారంగా సమస్యలు తీరడం లేదని వారు అన్నారు. రోజురోజుకు విద్యావ్యవస్థలో ఫీజులు వసూలు అధికంగా చేస్తున్నారని వారు అన్నారు. విద్యార్థి హక్కుల పై ప్రశ్నించకుండా విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని వారు అన్నారు. ఒకవైపు విద్యార్థులు యువత ప్రశ్నించి దేశానికి రాష్ట్రానికి మంచి వనరులు తీసుకువచ్చే ప్రయత్నంలో విద్యార్థులు యువత ఉండాలని చెప్పుతూ మరోవైపు విద్యార్థుల హక్కులను కాల రాస్తున్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని వారు అన్నారు. విద్యార్థులు యువత ఏమాత్రం ప్రశ్నించకుండా స్వార్థ రాజకీయాలకు అనుగుణంగా విద్యార్థులు యువత ఉండాలని ఉద్దేశంతోనే కొత్త కొత్త జీవోలు తీసుకొని వచ్చి విద్యార్థుల జీవితాలు నాశనం చేస్తున్నాయని వారు తెలిపారు విద్యార్థుల సమస్యలు కనీసం చెప్పుకోడానికి అవకాశం ఇవ్వనట్టి రాష్ట్ర ప్రభుత్వాలకు సిగ్గుచేటని వారు తెలిపారు స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ లు మెస్చార్జీలు లేక పేద బడుగు బలహీన విద్యార్థులు అందరూ కూడా దూరమై పరిస్థితి ఉందని వారు తెలిపారు ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో విద్యార్థులంతా ఏకం చేసి భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు డిమాండ్ చేశారు ఆత్మకూరు పట్టణంలోని పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మహిళ డిగ్రీ కళాశాల ప్రభుత్వ ఐటిఐ కళాశాల పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసి వారి జీవితాలకు బాట చూపాలని వారు డిమాండ్ చేశారు అదేవిధంగా హాస్టల్ విద్యార్థులకు పెరిగినటువంటి ధరలకు అనుగుణంగా హాస్టల్ ప్రతి విద్యార్థికి 3000 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఆత్మకూరు మండలం నూతన కమిటీని 17 మందితో ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు రానున్న రోజుల్లో విద్యార్థుల సమస్యలపై మరింత పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేసి విద్యార్థుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతామని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు

## కరువు మండలాలుగా ప్రకటించాలని

# ఈ నెల 22న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

## - ఏపీ రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు

**కొత్తపల్లి:** వర్షాలు లేక పంటలన్నీ ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు వ్యవసాయ కూలీలకు పనులు లేక మండలంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని కొత్తపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఈనెల 22న ఆత్మకూరు ఏ డి ఏ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో రైతులు వ్యవసాయ కూలీలు కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ రాజశేఖర్ మండల కార్యదర్శి ఎస్ సంజీవరాయుడు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు పిలుపునిచ్చారు మంగళవారం నాడు సింగరాజు పల్లె గ్రామంలో రైతు సంఘం మండల అధ్యక్షులు గంగన్న అధ్యక్షతన రైతు వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ నెలలో కురిసిన వర్షాలకు మండలంలోని రైతులు మొక్కజొన్న ప్రతి మినుము సోయా వరి తదితర పంటలను అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేశారు ఉన్నారు జులై ఆగస్టు నెలలో వర్షాలు కురవకపోవడం వల్ల వేసిన పంటలు ఎదుగుదల లేక ఎండిపోతున్నాయి ఇప్పటికే చాలామంది రైతులు వేసిన పంటలను చెడగొట్టుకోవలసినటువంటి పరిస్థితి ఏర్పడింది మరోపక్క వ్యవసాయంలో పనులు లేక వ్యవసాయ కూలీలకు ఉపాధి దొరకడం లేదు మండలంలో తీవ్రమైనటువంటి కరువు చాయలు అమ్ముకున్నాయి అని అన్నారు ప్రభుత్వం రైతుల చేత పంటల బీమా చేయిస్తుంది తప్పా రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు గత రెండు సంవత్సరాలుగా బీమా కంపెనీలకు వేలకోట్ల రూపాయలు ఆదాయాన్ని సమకూరు వస్తున్నాయి గాని రైతులకు బీమా చెల్లింపులు సక్రమంగా జరగలేదని ఆరోపించారు ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటిస్తేనే రైతులకు బీమా పరిహారం అందుతాయని అందుకనే వెంటనే కరువు మండలాలుగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని పంట నష్టపరిహారం వంటల బీమా రైతులకు వర్తింపజేసి ఆదుకోవాలని వ్యవసాయ కూలీలకు కరువు కూపన్ల ద్వారా బియ్యము



నిత్యవసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని మండలంలో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా పశుగ్రాసాన్ని అందించాలని ఉపాధి కూలీలకు 250 రోజులు పని కల్పించి రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని ఈనెల 22వ తేదీన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరు వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు జరిగే దారుణాలు రైతులు కౌలు రైతులు వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గోపాల్ రెడ్డి వెంకటేశ్వర గౌడ్ ఏ కృష్ణుడుచిన్న స్వామి జ్ఞాన సూర్యుడు దేవకుమార్ గోపాల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## చింతలచెరువు స్వర్ణ విలేజ్ సందర్శించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కడప టాస్క్ ఫోర్స్ బృందం



**బద్వేలు** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ వారి ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో బద్వేల్ మండలం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని చింతలచెరువు స్వర్ణ విలేజ్ మంగళవారము జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయం కడప నుండి జిల్లా టాస్కోర్స్ బృందం సందర్శించడం అయినది. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి ఏ. రమేష్ రెడ్డి మాట్లాడుతూ రికార్డ్స్ రిపోర్టులో ఆధారంగా గర్భిణీలు, బాలింతలు కౌ మర దశ బాలికలు, రక్తహీనత డేటామరియు చిన్నపిల్లల వ్యాధి నిరోధక టీకాల యొక్క సర్వీసెస్ తీసుకొని సంబంధిత వారి వద్దకు వెళ్లి వారికి హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించి డేటా పరిశీలించడం అయినది రికార్డ్స్ రిపోర్ట్స్ ఆన్లైన్లో ఆర్ సీ హెచ్ రిపోర్టు, హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం చెక్ చేయసి,ఫీల్డ్ లో పర్యవేక్షించడం జరిగింది . మాతృ మరణాలు శిశు మరణాలను అరికట్టే దానికి ప్రతి ఒక్కరము బాధ్యతగా నిర్వర్తించి, గర్భిణీ,కానుప్ప సమయంలో ఏ తల్లి మరణించకూడదు పుట్టిన ప్రతి బిడ్డ కూడా సురక్షితంగా ఉండాలని పేర్కొనడమైనది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నారాయణ మరియు మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం అధికారి రాజశేఖర్ పాల్గొని గర్భిణీ స్త్రీలు బాలింతల సర్వీసెస్ వ్యాధి నిరోధక టీకాలు యొక్క సర్వీసెస్ అంతర్జాలంలో పరిశీలించి లబ్ధిదారులను వివరాలు తెలుసుకోవడం అయినది.ఈ కార్యక్ర మంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి రాజేష్ కుమార్ జిల్లా గణాంక అధికారి ఏ రమేష్ రెడ్డి, డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం అధికారి రాజశేఖర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రావతి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీస ర్ బి వెంగయ్య హెల్త్ అసిస్టెంట్ వి జనార్దన్ రావు విలేజ్ హెల్త్ క్లినిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఏ ఎన్ యంసుబ్బలక్ష్మి అంగన్వాడి టీచర్స్ ఆశా కార్యకర్తలు పాల్గొనడం అయినది.

## కె. కేశవరావు అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం



**హైదరాబాద్** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావు అధ్యక్షతన ఆయన నివాసంలో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ నేపథ్యంలో కమిటీ ఇప్పటికే వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థి ఉద్యమకారులు, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ప్రజాసంఘాలు మరియు సమాజంలోని సబ్బండ వర్గాల ప్రతినిధులతో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపింది.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వివిధ వర్గాల నుంచి వారి అనుభవాలు, అభిప్రాయాలు, సలహాలు మరియు సూచనలను కమిటీ స్వీకరించింది. ఉద్యమ స్వరూపం, వివిధ దశల్లో ప్రజల భాగస్వామ్యం, ఉద్యమకారుల గుర్తింపునకు అవసరమైన ప్రమాణాలు తదితర అంశాలపై వచ్చిన సూచనలను సమావేశంలో సమీక్షించారు.స్వీకరించిన సలహాలు, సూచనలు మరియు ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి, త్వరలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం కానుంది.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారుల సేవలను సముచితంగా గుర్తించి, పారదర్శకంగా మరియు సమగ్రంగా గుర్తింపు కల్పించేందుకు కమిటీ కట్టుబడి ఉందని సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారు.

## గాయపడిన కొక్కెరంచ దినేష్‌కి ఆర్థిక సహాయం

### - భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ




**ఆత్మకూరు:** ఈనెల తొమ్మిదవ తేదీన కొత్తపల్లి మండలం కొక్కెరంచ గ్రామానికి చెందిన దినేష్ రోడ్డు ప్రమాదానికి గురి కావడం జరిగింది వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తరఫున ఆర్థిక సహాయం 5700 విరాళంగా సేకరించి ఇవ్వడం జరిగిందని ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు కే దినేష్ కుమార్ ఆత్మకూరు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇస్మాయిల్ సాయికుమార్ లు అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలోని స్థానిక డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్ నందు గాయపడినటువంటి దినేష్ కి ఆర్థిక సహాయంగా 5700 ఇవ్వడం జరిగిందని వారు అన్నారు. అదేవిధంగా హైవే రోడ్లపై ప్రయాణం చేస్తున్నటువంటి విద్యార్థి విద్యార్థులకు యువత ప్రజానీకానికి హెల్మెట్ ధరించి మన ప్రాణాలను మనం కాపాడుకోవాల్సినటువంటి బాధ్యత మనపై ఉందని వారు అన్నారు. అదేవిధంగా రోడ్లపై డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం సేవించి నడపడం సరికాదని విద్యార్థులకు యువతకు ప్రజానీకానికి వారు తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా బైక్ పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించి వెళ్లాలని వారు తెలిపారు . అదేవిధంగా ఆ యొక్క పేద కుటుంబానికి ఇంకా దాతలు వారికి తోచినంతగా సహాయం చేయాలని వారు కోరారు. ఒక ప్రాణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరు కూడా మనం అదృష్టవంతులుగా భావించాలని వారు తెలిపారు. ఈ విరాళానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల జూనియర్ లెక్చరేర్ జి నాగ మద్దిలేటి మరియు ఆత్మకూరు ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ మరియు దాతలకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తరఫున ధన్యవాదాలు తెలిపారు. మన స్నేహితుడు ప్రాణాలు కాపాడుకోవడానికి విరాళాలు సేకరించడానికి ప్రయత్నం చేస్తున్నటువంటి దినేష్ ఫ్రెండ్స్ అందరికి కూడా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రామ్ నాయక్ ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మార్ నాయక్ మరియు ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్ మౌలాలి బన్నీ పవన్ తరుణ్ గుర్రప్ప వెంకట్ పాల్గొనడం జరిగింది

# సౌమ్య మెడికల్ కాలేజీలో ఏం జరుగుతోంది.?

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా? వేధింపులు, బెదిరింపులు, వసతుల లేమిపై ఆరోపణలు
- సర్టిఫికెట్లు మా చేతుల్లోనే.. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరంటున్నారంటూ విద్యార్థుల ఆవేదన
- రెండు వారాలుగా సమస్య పరిష్కారం కాక ఆందోళన.. సమగ్ర విచారణకు విద్యార్థి సంఘాల డిమాండ్

గుంటూరు(ప్రశ్న న్యూస్) విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన విద్యాసంస్థలోనే వేధింపులు, బెదిరింపులు, వసతుల కొరత, అధిక ఫీజులు, సర్టిఫికెట్ల వ్యవహారంపై తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తడం ఆందోళన కలిగిస్తోంది. గుంటూరులోని సౌమ్య మెడికల్ కాలేజీ యాజమాన్యంపై కొంతమంది విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పలు తీవ్రమైన ఆరోపణలు చేస్తుండటంతో ఈ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల ఆరోపణల ప్రకారం.. కాలేజీ కరస్పాండెంట్ సమీర్ చంద్ర, ప్రిన్సిపాల్ పేరుతో వ్యవహరిస్తున్న సిబ్బందిపై అనుచిత ప్రవర్తన, దుర్భాషలు, బెదిరింపులు, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, సర్టిఫికెట్లను తమ ఆధీనంలో ఉంచుకోవడం వంటి పలు ఫిర్యాదులు ఉన్నాయి. అయితే ఇవన్నీ విద్యార్థులు, విద్యార్థి సంఘాలు చేస్తున్న ఆరోపణలు మాత్రమేనని, వాటిపై సంబంధిత అధికారులు స్వతంత్రంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉందని పలువురు కోరుతున్నారు.



### మా భవిష్యత్తు ఏంటి.?



కాలేజీలో చదువుతున్న విద్యార్థుల ఆవేదన ఒక్కటే–"మా చదువులు మధ్యలో ఆగిపోతే మా భవిష్యత్తు ఏమవుతుంది.? మా సర్టిఫికెట్లు ఎప్పుడు ఇస్తారు.? మేము మరో విద్యాసంస్థకు వెళ్లే అవకాశం ఉందా.?" అని ప్రశ్నిస్తున్నారు. తమకు అనుకూలంగా లేని పరిస్థితుల్లో కాలేజీ నుంచి బయటకు వెళ్లాలని భావించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఫీజులు చెల్లించినప్పటికీ తగిన విద్యా వసతులు అందడం లేదని, కాలేజీ నుంచి బదిలీ కావాలనుకునే విద్యార్థులకు అవసరమైన పత్రాలు అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### వేధింపులు.. బెదిరింపుల ఆరోపణలు

విద్యార్థుల కథనం ప్రకారం.. తమ సమస్యలను ప్రశ్నించినప్పుడు యాజమాన్యం నుంచి తీవ్రంగా మాట్లాడటం, బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. "మంత్రులు, అధికారులు ఎవరూ తమను ఏమీ చేయలేరని, ఎవరినైనా తాము చూసుకోగలమని" యాజమాన్యంలోని కొందరు వ్యక్తులు విద్యార్థుల ఎదుట వ్యాఖ్యానించారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అలాగే తమ సర్టిఫికెట్లు యాజమాన్యం చేతుల్లో ఉన్నాయని, తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారని వారు చెబుతున్నారు. ఈ ఆరోపణలు నిజమైతే అత్యంత తీవ్రమైన అంశమని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఒక విద్యార్థి తన హక్కుల గురించి ప్రశ్నించినందుకు బెదిరింపులకు గురైతే అది విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తుందని వారు అంటున్నారు.

### ప్రిన్సిపాల్ వ్యవహారంపై సందేహాలు

కాలేజీ ప్రిన్సిపాల్‌గా దీప్తి అనే పేరు సర్టిఫికెట్లపై ఉన్నప్పటికీ, ఆమె ప్రత్యక్షంగా అందుబాటులో ఉండడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మరోవైపు మానస అనే వ్యక్తి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. సర్టిఫికెట్లపై సంతకాలు ఎవరు చేస్తున్నారు? అధికారికంగా ప్రిన్సిపాల్ ఎవరు? ఇన్‌చార్జికి సంతకం చేసే అధికారం ఉందా? విద్యాసంస్థకు సంబంధించిన అధికారిక రికార్డులు ఎవరి ఆధీనంలో ఉన్నాయి? అనే ప్రశ్నలు విద్యార్థుల నుంచి వినిపిస్తున్నాయి. కొంతమంది విద్యార్థులు సర్టిఫికెట్లపై ఉన్న సంతకాల విషయంలో కూడా అనుమానాలు వ్యక్తం చేస్తూ, అవి అధికారికంగా ఎవరివో విచారణ చేయాలని కోరుతున్నారు. దొంగ సంతకాలు జరిగాయని తేల్చి చెప్పడం కంటే, సంబంధిత రికార్డులు, సంతకాలు, అధికారిక అనుమతులను అధికారులు పరిశీలించి వాస్తవాలను వెలికి తీయాల్సిన అవసరం ఉంది.

### జూన్ 16న విద్యార్థిని మృతి.. అప్పటి వ్యవహారంపైనా ప్రశ్నలు

ఇదే కాలేజీలో మంజుష అనే విద్యార్థిని జూన్ 16న అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఘటనను కూడా విద్యార్థులు ప్రస్తావిస్తున్నారు. అనారోగ్యంతో ఉన్న సమయంలో తగిన సమయంలో వైద్య సహాయం అందిందా.? తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారా? విద్యార్థిని పరిస్థితిపై కాలేజీ యాజమాన్యం ఏ చర్యలు తీసుకుంది.? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. అయితే విద్యార్థిని మృతికి కాలేజీ యాజమాన్యమే కారణమని నిర్ధారించడానికి అధికారిక విచారణ అవసరం. మృతికి సంబంధించిన వైద్య నివేదికలు, చికిత్స వివరాలు, తల్లిదండ్రుల వాంగ్మూలం, కాలేజీ రికార్డులు, సీసీటీవీ తదితర ఆధారాలను పరిశీలించిన తర్వాతే వాస్తవ పరిస్థితులు వెల్లడవుతాయి.

### హాస్టల్‌లో వసతులు ఎక్కడ.?

విద్యార్థుల ఆరోపణల్లో హాస్టల్ వసతుల అంశం కూడా ప్రధానంగా ఉంది. తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, సరైన ఆహారం, గదుల నిర్వహణ తదితర విషయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. సాధారణ నీటి సదుపాయం కల్పిస్తూ మినరల్ వాటర్ పేరుతో అదనపు ఖర్చులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. హాస్టల్ ఫీజులు, ఇతర చార్జీల వివరాలను స్పష్టంగా వెల్లడించాలని, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలకు అనుగుణంగానే ఫీజులు ఉన్నాయా లేదా అనే అంశాన్ని అధికారులు పరిశీలించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

"సౌకర్యాలు నిల్.. అసౌకర్యాలు ఫుల్" అన్నట్లుగా పరిస్థితి ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### విద్యార్థినుల భద్రతపై తీవ్ర ఆందోళన



విద్యార్థినుల భద్రతకు సంబంధించిన ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. యాజమాన్యం, సిబ్బందిలో కొందరు విద్యార్థినుల ఎదుట అనుచిత దుస్తులతో సంచరిస్తున్నారని, రాత్రివేళల్లో విద్యార్థినుల గదుల్లోకి వెళ్లి ప్రశ్నలు అడుగుతున్నారని కొందరు విద్యార్థులు ఆరోపించారు. ఈ ఆరోపణలు నిజమైతే, మహిళా విద్యార్థుల భద్రత, గోప్యత, గౌరవానికి సంబంధించిన అంశంగా దీనిని అత్యంత సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉంది. హాస్టల్‌లో మహిళా విద్యార్థుల గదుల్లోకి ఎవరు, ఏ సమయంలో, ఏ నిబంధనల ప్రకారం ప్రవేశించవచ్చనే దానిపై స్పష్టమైన నిబంధనలు ఉండాలి. సీసీటీవీ రికార్డులు, హాస్టల్ రిజిస్టర్లు, భద్రతా సిబ్బంది వివరాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### కులం, మతం పేరుతో దూషణల ఆరోపణలు

విద్యార్థుల ఆరోపణల్లో కులం, మతం పేరుతో అవమానకరంగా మాట్లాడుతున్నారనే అంశం కూడా ఉంది. విద్యార్థులను వారి సామాజిక నేపథ్యం ఆధారంగా దూషించడం లేదా అవమానించడం జరిగితే అది తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. విద్యాసంస్థలో ప్రతి విద్యార్థికి సమాన గౌరవం, భద్రత కల్పించడం యాజమాన్యం బాధ్యత. ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు విద్యార్థుల నుంచి గోప్యంగా వాంగ్మూలాలు తీసుకుని, అవసరమైతే చట్టపరమైన చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

### "30 మంది బయటకు వచ్చారు"

విద్యార్థుల వివరాల ప్రకారం కాలేజీలో మొత్తం సుమారు 50 మంది విద్యార్థులు ఉండగా, వారిలో సుమారు 30 మంది బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు కాలేజీని విడిచి బయటకు వచ్చారని చెబుతున్నారు. వారు తమ విద్యను మరో విద్యాసంస్థలో కొనసాగించేందుకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు, ఇతర విద్యా పత్రాలు ఇవ్వాలని కోరుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వివాదం త్వరగా పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు కలిసి కూర్చుని పరిష్కారం కనుగొనాలని పలువురు సూచిస్తున్నారు.

### రెండు వారాలుగా తేలని సమస్య

ఈ సమస్య సుమారు రెండు వారాలుగా కొనసాగుతున్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన పరిష్కారం రాలేదని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. సమస్యపై జిల్లా కలెక్టర్, డీఎం అండ్‌హెచ్‌ఓ తదితర అధికారులను కలిసి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా తగిన స్పందన లేదని వారు ఆరోపిస్తున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన విద్యార్థులను "ఇప్పటివరకు ఎందుకు ఫిర్యాదు చేయలేదు?" అంటూ ప్రశ్నించారని వారు చెబుతున్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై సంబంధిత అధికారి వివరణ తీసుకోవాల్సి ఉంది.

### విద్యార్థి సంఘాల న్యాయపోరాటం

విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎన్‌ఎస్‌యూఐ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థుల తరఫున షేక్ కరీం తదితరులు మాట్లాడుతూ.. యాజమాన్యంపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, విద్యార్థుల సర్టిఫికెట్లు వారికి అందించాలని, అర్హత ఉన్న విద్యార్థులకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు జారీ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసిన ఫీజులు ఉంటే వాటిని పరిశీలించి తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### విద్యాశాఖ.. వైద్య ఆరోగ్యశాఖ ఏం చేస్తాయి?

ఇక్కడ అసలు ప్రశ్న ప్రభుత్వ యంత్రాంగం వైపు తిరుగుతోంది. విద్యార్థులు ఇన్ని ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ఇప్పటికైనా పూర్తి స్థాయి విచారణ చేపడతారా? కాలేజీకి అవసరమైన అనుమతులు ఉన్నాయా? విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు ఉన్నాయా? హాస్టల్ నిబంధనలు పాటిస్తున్నారా? ఫీజుల వసూళ్లు నిబంధనల ప్రకారమేనా? అధ్యాపకులు, ప్రిన్సిపాల్ అర్హతలు, నియామకాలు సక్రమంగా ఉన్నాయా? విద్యార్థుల సర్టిఫికెట్ల నిర్వహణ ఎలా జరుగుతోంది? అనే అంశాలపై సమగ్ర తనిఖీ అవసరమని విద్యార్థులు కోరుతున్నారు. అలాగే విద్యార్థిని మంజుష మృతి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, వైద్యపరమైన అంశాలపై కూడా అవసరమైన విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

విద్యార్థుల ఆరోపణలు నిజమా? కాదా? అనేది తేల్చడం ప్రభుత్వ అధికారుల బాధ్యత. ఒకవైపు విద్యార్థులు తీవ్ర ఆరోపణలు చేస్తుంటే, మరోవైపు కాలేజీ యాజమాన్యానికి కూడా తమ వాదనను వెల్లడించే పూర్తి అవకాశం ఇవ్వాలి. రెండు వర్గాల వాదనలు నమోదు చేసి, ఆధారాలను పరిశీలించి నిష్పాక్షిక నివేదిక రూపొందించాలి.

జిల్లా కలెక్టర్ నేతృత్వంలో విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు శాఖ, అవసరమైన ఇతర సంబంధిత విభాగాలతో సంయుక్త విచారణ కమిటీ ఏర్పాటు చేసి వాస్తవాలను వెలికి తీయాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

విద్యార్థినుల భద్రతకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో మహిళా అధికారులతో కూడిన ప్రత్యేక బృందం విద్యార్థులతో గోప్యంగా మాట్లాడాలని కూడా విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

### ప్రభుత్వం తక్షణం స్పందించాలి

విద్యార్థుల జీవితాలతో ముడిపడిన సమస్యను రాజకీయాలు, వ్యక్తిగత విభేదాల కోణంలో చూడకుండా విద్యార్థుల భవిష్యత్తు కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిరాధారమైతే విద్యార్థులకు స్పష్టమైన వాస్తవాలను అధికారులు తెలియజేయాలి. విద్యార్థుల సర్టిఫికెట్లు, ట్రాన్స్‌ఫర్ అంశం, ఫీజులు, హాస్టల్ వసతులు, భద్రత, ప్రిన్సిపాల్ నియామకం, సిబ్బంది ప్రవర్తన, విద్యార్థిని మృతి ఘటన –ఇలా ప్రతి అంశాన్ని విడివిడిగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

విద్యాసంస్థ అంటే కేవలం భవనం కాదు.. విద్యార్థుల భవిష్యత్తు. సర్టిఫికెట్ అంటే కేవలం కాగితం కాదు.. ఒక విద్యార్థి జీవితానికి ఆధారం. హాస్టల్ అంటే కేవలం గది కాదు.. తల్లిదండ్రులు తమ పిల్లలను నమ్మి అప్పగించే ప్రదేశం.

అందుకే సౌమ్య మెడికల్ కాలేజీపై వస్తున్న ఆరోపణలను ప్రభుత్వం తేలిగ్గా తీసుకోకుండా, నిజానిజాలను నిగ్గు తేల్చి విద్యార్థులకు న్యాయం చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలి.. ఆరోపణలకు ముగింపు పలకాలి.. వాస్తవాలను వెలుగులోకి తేవాలి.

---

### ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా

# జాతీయ సదస్సు

## – గవర్నర్కు ఆహ్వానం

**హైదరాబాద్,** హైదరాబాదులో రెండు రోజులు పాటు జరిగే ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభిస్తారు. మంగళవారం నాడు లోక భవన్లో గవర్నర్ శివప్రతాప్ శుక్ల గారిని ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల నేతృత్వంలో ప్రతినిధి బృందం కలిసింది. జాతీయ స్థాయిలో జరిగే ఈ కాంక్లేవ్ ప్రారంభ ఆహ్వాన విందుకు హాజరవుతానని గవర్నర్ తన అంగీకారం తెలిపారు. జాతీయస్థాయిలో మీడియా పోకడలు ఎదుర్కొంటున్న సవాళ్లు, జర్నలిస్టుల పనితీరుపై గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సందేశం ఇస్తారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏ. రాజేష్, జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యులు ఎన్ .శ్రీనివాస్ రెడ్డి తదితరులు గవర్నర్ గారిని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఇదే సందర్భంగా గవర్నర్కు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ డైరీ ని పాలక మండలి అందజేసింది. గవర్నర్కు పూల మొక్కను అందజేసి సత్కరించారు. ఈనెల 21 తేదీన తాజ్ కృష్ణ హోటల్లో జరిగే ఈ సదస్సు ప్రారంభ ఆహ్వాన విందు కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. దేశం నలుమూలల నుంచి సీనియర్ జర్నలిస్టులు ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రెండు రోజుల సదస్సుకు హాజరవుతారు.

# నగరంలో అత్యాధునిక డెర్మ క్లినిక్

**హైదరాబాద్ :** అత్యాధునిక పద్ధతిలో డెర్మటాలజీ చికిత్సలు అందించే ఆసుపత్రిని నగరంలో అందుబాటులోకి తెస్తున్నట్లు వీకే కొరియన్ డెర్మ వ్యవస్థాపకులు కార్తీక్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ప్రణయ్ రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. కొరియన్ సాంకేతిక పరిజ్ఞానంతో తమ వద్ద వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. బుధవారం జేఎన్టీయూ మెట్రో స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఆసుపత్రిని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కొరియన్ దేశంలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన వైద్యుల బృందం చికిత్సలు అందిస్తారని తెలిపారు.

## హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న డిజైన్ డెమోక్రసీ 2026




**హైదరాబాద్ :** భారతదేశంలో ప్రముఖ డిజైన్ ఫెస్టివల్‌గా గుర్తింపు పొందిన డిజైన్ డెమోక్రసీ నాలుగో ఎడిషన్‌కు సిద్ధమైంది బంజారాహిల్స్ లోని రెడిసన్ బ్లూ హోటల్లో వెల్లడించారు. సెప్టెంబర్ 18, 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ వేడుక జరగనుంది అన్నారు. 200కు పైగా డిజైన్ బ్రాండ్లు, 150 మందికి పైగా ఆర్కిటెక్ట్‌లు, డిజైనర్లు, కళాకారులు, నిపుణులు పాల్గొననున్నారు. 30 వేల మందికి పైగా సందర్శకులు హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఆర్కిటెక్చర్, ఇంటీరియర్స్, ఫర్నిచర్, ఆర్ట్, టెక్స్‌టైల్స్, హస్తకళలకు సంబంధించిన ప్రదర్శనలు, ఇన్‌స్టాలేషన్లు, ప్యానెల్ చర్చలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. డిజైన్ భవిష్యత్తుపై డీడీ టాక్స్, డీడీ ఫోకస్ కార్యక్రమాలతో పాటు 'ది గౌర్మెట్ జోన్'ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. భారతీయ డిజైన్, సృజనాత్మకత, సంప్రదాయం, ఆధునికతను ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా డిజైన్ డెమోక్రసీ 2026 నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట

# ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన



**కొలిమిగుండ్ల** నంద్యాల జిల్లా కేంద్రంలో ఉన్న కలెక్టర్ కార్యాలయం ఎదుట ఇవాళ ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. నూతన పెన్షన్ల కొరకు కొత్తగా ఆన్లైన్ నమోదు ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి. షెడ్యూల్ కులాలకు పరిశ్రమలను నిర్మించుకోవడానికి సబ్సిడీ రుణాలను ప్రభుత్వం వెంటనే కేటాయించాలి. మాదిగలకు 20 లక్షల బీమా పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ రాజకుమారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కొలిమిగుండ్ల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, కోటేష్, పూలరాజు, సుబ్బమ్మ, రాధమ్మ, బాల ఓబులేష్, బాల కంబయ్య, రామాంజనేయులు, శంకర్, చిన్న వీరయ్య, వెంకటన్న, రామంజి, పెద్దయ్య ఇంకా తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు

## ఎద్దులదొడ్డి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**తుగ్గలి:** తుగ్గలి మండల పరిధిలోని గల ఎద్దులదొడ్డి గ్రామం నందు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం రోజున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు మోహన్ విజయ్ కుమార్,మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా రైతులకు ఎల్నినో ప్రభావం గురించి రైతులకు తెలియజేశారు. పొలాలలో పంటలు బెట్టను తట్టుకోవాలంటే పంటల పైన పొటాషియం నైట్రేట్ స్ప్రే చేసుకోవాలని వారు రైతులకు సూచించారు. అలాగే ఇంకా ఎవరైనా ఇన్సూరెన్స్ కట్టని యెడల మీసేవ యందు ఇన్సూరెన్స్ కట్టుకోవాలని తెలియజేశారు. ఇన్సూరెన్స్ కట్టిన ప్రతి రైతు కూడా పంట నమోదు చేసుకుని రైతు సేవ కేంద్రంకు వెళ్లి ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని వారు తెలియజేశారు. ఈ కేవైసీ పూర్తి చేయని ఎడల ఇన్సూరెన్స్ వర్తించవని వారు రైతులకు సూచించారు. మన మండలంలో మొత్తం 69 వేల ఎకరాలు పంట సాగు అవుతుందని,అందులో 35 వేల ఎకరాల పంట నమోదు జరిగిందని, రైతు సేవ కేంద్రాల యందు యూరియా పుష్కలంగా లభిస్తుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మీనారాయణ,వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాలి

**- స్కిల్ యూనివర్సిటీ ప్రతిపాదనను రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు సుద్దాల వంశీ, కార్యదర్శి కోనేరు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేస్తే విద్యార్థుల భవిష్యత్తు ఏమవుతుందని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అవసరమే అయినప్పటికీ, పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేస్తూనే నూతన నైపుణ్య కోర్సులను ప్రవేశపెట్టాలని, ప్రస్తుతం ఉన్న వ్యవస్థను బలహీనపరచకూడదని అన్నారు. విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకుని, వారికి అవసరమైన సిలబస్‌లు, కోర్సులను అందించాలని కోరారు. స్కిల్ యూనివర్సిటీలోకి మార్పు వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు ఉన్నత విద్య అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉందని, సాంకేతిక విద్యార్థులను కేవలం కార్మికులుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య, ఆధునిక సాంకేతికతకు అనుగుణమైన సిలబస్‌లు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రతిపాదిత స్కిల్ యూనివర్సిటీ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గజ్వేల్ టౌన్ అధ్యక్షుడు గొల్లపల్లి ప్రవీణ్, కార్యదర్శి బేగరి చరణ్, నాయకులు వినయ్, మణిదీప్, సిద్ధార్థ్, అలాగే పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రవీణ్, నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దూరులో భారీ అగ్నిప్రమాదం

**మహాలక్ష్మి ఫర్నిచర్ షాప్, గోదాంలో చెలరేగిన మంటలు**

**ఒకరి మృతి, రూ.50 లక్షల వరకు ఆస్తి నష్టం**



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) పట్టణంలోని పెద్దూరులో మహాలక్ష్మి ఫర్నిచర్ షాప్, గోదాంలో ఉదయం అకస్మాత్తుగా భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. షాప్ గోదాంలో నలుగురు కూలీలు నిద్రిస్తుండగా, ముగ్గురు సురక్షితంగా బయటకు వచ్చినట్లు యజమాని తెలిపారు. మరో కూలీ ప్రమాదంలో మరణించాడని



తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. మంటలు తీవ్రంగా ఉండటంతో అదుపులోకి తీసుకురావడం కష్టంగా మారింది. అదనంగా రెండు ఫైర్ ఇంజన్లను రప్పించి మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి, పట్టణ సీఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది ఘటనాస్థలిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అగ్నిప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమా లేక ఎవరైనా కావాలనే నిప్పు పెట్టారా. అనే అనుమానాలను షాప్ యజమాని వ్యక్తం చేశారు. ఇటీవల అప్పులు, బ్యాంకు రుణాలు తీసుకుని ఈఎంఐలు చెల్లిస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నామని, ఫర్నిచర్ తయారీని కూడా కూలీలతో అక్కడే చేపడుతున్నామని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని యజమాని తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

# పురంధేశ్వరి, రాం మాధవ్‌కు శుభాకాంక్షలు తెలిపిన

**- ఉప ముఖ్యమంత్రిపవన్ కల్యాణ్**

**- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తారు**

**- విష్ణువర్ధన్ రెడ్డికి అభినందనలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి**



అమరావతి(ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, రాం మాధవ్‌లకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో బీజేపీకి సంబంధించిన అన్ని విభాగాలకు సంయుక్త సమన్వయకర్తగా ఎంపికైన విష్ణువర్ధన్ రెడ్డికి కూడా అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. పురంధేశ్వరి, రాం మాధవ్‌లకు రాజకీయంగా ఉన్న సుదీర్ఘ అనుభవం పార్టీకి మరింత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

### నూతన కార్యవర్గానికి అభినందనలు

బీజేపీ నూతన జాతీయ కార్యవర్గానికి ఎంపికైన ప్రతి ఒక్కరికీ పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కొత్త బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీని మరింత బలోపేతం చేస్తూ దేశాభివృద్ధి, ప్రజాసేవలో తమ వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో దేశాభివృద్ధి, ప్రజాసేవ లక్ష్యాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని పవన్ కల్యాణ్ కోరారు. జాతీయ స్థాయిలో కొత్త బాధ్యతలు చేపట్టిన నాయకులు తమ అనుభవం, సామర్థ్యంతో పార్టీకి మరింత సేవలందించాలని ఆకాంక్షిస్తూ పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.

# కేబిఆర్ పార్కు చుట్టూ వన్ వే ట్రాఫిక్ పరిశీలన

**- స్వయంగా బైక్ పై తిరిగిన సిపి సజ్జనార్ - ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా పలు సూచనలు**







హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేబీఆర్ పార్క్ పరిసరాల్లో అమలవుతున్న వన్‌వే ట్రాఫిక్ నిర్వహణ తీరును నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మంగళవారం బైక్‌పై స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదనపు సీపీ (శాంతిభద్రతలు) తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ (ఎస్బీ, శాంతి భద్రతలు, నార్త్ రేంజ్) ఎస్.ఎమ్.విజయ్ కుమార్ లతో కలిసి ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఈ క్రమంలో ఫిల్మ్‌నగర్, రోడ్ నంబర్ 45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, వెంకటగిరి, కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం, ముగ్ధ, బసవతారకం, అగ్రసేన్ జంక్షన్ల మీదుగా ప్రయాణిస్తూ వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ పరిస్థితులను నిశితంగా సమీక్షించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై క్షేత్రస్థాయి అధికారులకు తగు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్యల నివారణకు, సాఫీ ప్రయాణానికి ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ ట్రాఫిక్ డి.జోయల్ డేవిస్, డీసీపీ ట్రాఫిక్ కాజల్ సింగ్ పాల్గొన్నారు.

# గుడిలోవలో నేటి నుంచి ఆర్ఎస్ఎస్ అఖిల భారత సమన్వయ బైఠక్

**జనాభా అసమతుల్యత, మాదకద్రవ్యాల కట్టడిపై చర్చలు**

**'పంచ పరివర్తన్'తో సామాజిక మార్పుపై కార్యాచరణ**

**32 సంస్థల నుంచి 327 మంది ప్రతినిధుల హాజరు**

విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)దేశంలో మారుతున్న జనాభా తీరుతెన్నులు, యువతను నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాల వినియోగం, సామాజిక మార్పులు, సమగ్ర అభివృద్ధి తదితర అంశాలపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అఖిల భారత సమన్వయ బైఠక్‌లో చర్చించనున్నట్లు ఆర్ఎస్ఎస్ జాతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ తెలిపారు. విశాఖపట్నం సమీపంలోని గుడిలోవ విజ్ఞాన విహార పాఠశాలలో బుధవారం నుంచి మూడు రోజులపాటు ఈ సమావేశాలు జరగనున్నాయి. మంగళవారం విజ్ఞాన విహార పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సునీల్ అంబేకర్ మాట్లాడారు. ఆగస్టు 19న ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే బైఠక్.. ఆగస్టు 21 సాయంత్రం వరకు కొనసాగుతుందని తెలిపారు. సంఘ ప్రేరణతో పనిచేస్తున్న 32 సంస్థలకు చెందిన ప్రధాన బాధ్యులు ఇందులో పాల్గొంటారని చెప్పారు.

### 327 మంది ప్రతినిధులు

ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్, సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబలే, సహ సర్‌కార్యవాహలు, ఇతర కేంద్ర బాధ్యులు సమావేశాలకు హాజరవుతారని తెలిపారు. భారతీయ మజ్దూర్ సంఘ్, విశ్వహిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీ, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, భారతీయ కిసాన్ సంఘ్, రాష్ట్ర సేవికా సమితి తదితర సంస్థల జాతీయ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సంఘటనా కార్యదర్శులు పాల్గొంటారని చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ సంస్థల నుంచి 49 మంది మహిళలతో కలిపి 253 మంది ప్రముఖులు, సంఘ ప్రముఖులతో కలిపి మొత్తం సుమారు 327 మంది ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు.

### సమన్వయమే ప్రధాన ఉద్దేశం


అఖిల భారత సమన్వయ బైఠక్ నిర్ణయాత్మక సమావేశం కాదని సునీల్ అంబేకర్ స్పష్టం చేశారు. సమాజహితం కోసం వివిధ సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలు, అనుభవాలను పరస్పరం





పంచుకోవడం, సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే సమావేశాల ప్రధాన ఉద్దేశమన్నారు. దేశంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న సామాజిక మార్పులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమీక్ష ఉంటుందని చెప్పారు. విలేకరుల సమావేశంలో దక్షిణ మధ్య క్షేత్ర సహ సంఘచాలక్ దూసి రామకృష్ణ, సహ ప్రచార ప్రముఖ్ ప్రదీప్ జోషి, ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు, సహ ప్రచార ప్రముఖ్ వాసుదేవరావు పాల్గొన్నారు.

# వెండికొండ సిద్దేశ్వర ఆలయం జాతర కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులకు సన్మానం

**మామిళ్ల అర్జున్ యాదవ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం**



శంషాబాద్ (ప్రశ్న న్యూస్) శంషాబాద్ లోని వెండికొండ సిద్దేశ్వర ఆలయం బ్రహ్మోత్సవాల ( జాతర) కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన బండి శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్యక్షుడు చిన్న మాదిరెడ్డి



శివారెడ్డిని రాఘవేంద్ర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిళ్ల అర్జున్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రతి ఏటా అంగరంగ వైభవంగా శ్రావణమాసంలో జరిగే సిద్దుల గుట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం గ్రామస్తులు వార్తక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా రాళ్లగూడ మాజీ ఎంపీటీసీ సభ్యుడు బండి శ్రీకాంత్ యాదవ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రాలగూడకు చెందిన చిన్న మాదిరెడ్డి శివారెడ్డి ఎంపికయ్యారు. వీరిద్దరిని రాళ్లగూడ రాఘవేంద్ర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిళ్ళ అర్జున్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. శంషాబాద్ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే వెండికొండ సిద్దేశ్వర స్వామి ఉత్సవ కమిటీలో రాళ్లగూడ కు చెందిన వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం పట్ల అర్జున్ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి జాతర వేడుకలను బ్రహ్మోత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడానికి పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. వారిని సన్మానించిన వారిలో అర్జున్ యాదవ్ తో పాటు రాఘవేంద్ర కాలనీ కి చెందిన నాయకులు వేణు, బిక్షపతి, రామసుబ్బయ్య, హనుమంతు, శ్రీకాంత్, కిరణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# వైభవంగా ధర్మరాజు స్వామివారి కల్యాణోత్సవం

**పాల్గొన్న మాజీ మంత్రి ఆర్కే రోజా-సెల్వమణి దంపతులు**



పుత్తూరు(ప్రశ్న న్యూస్) పుత్తూరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలతో మార్మోగింది. కల్యాణోత్సవం సందర్భంగా బజారు వీధిలోని వినాయక ఆలయం నుంచి అమ్మవారి పట్టు వస్త్రాలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### పట్టు వస్త్రాలు సమర్పించిన రోజా దంపతులు

మాజీ మంత్రి, నగరి మాజీ ఎమ్మెల్యే ఆర్కే రోజా, ఆమె భర్త సెల్వమణి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య దంపతులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు తెలిపారు.

### ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

ఈ సందర్భంగా ఆర్కే రోజా మాట్లాడుతూ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వామి, అమ్మవార్ల ఆశీస్సులతో పుత్తూరు ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పురాతన ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా కొనసాగుతున్న ఈ బ్రహ్మోత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం పుత్తూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# 'మోద కవిదా వాతావరణ' మూవీ రివ్యూ!



రొమాంటిక్ థ్రిల్లర్ సినిమాలను చూడటానికి యూత్ ఎక్కువగా ఇంట్రెస్ట్ చూపిస్తుంది. అందువల్లనే ఈ జోనర్ నుంచి వచ్చిన సినిమాలకు ఓటీటీ ఆడియన్స్ వైపు నుంచి బలమైన మద్దతు లభిస్తూ ఉంటుంది. అలా కన్నడ నుంచి వచ్చిన సినిమానే 'మోద కవిదా వాతావరణ'. షీలం ఎమ్ స్వామి - మోక్ష కుషాల్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి సింపుల్ సుని దర్శకత్వం వహించాడు. జూన్ 25వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, 'అమెజాన్ ప్రైమ్'లో ఇప్పుడు తెలుగులోనూ అందుబాటులోకి వచ్చింది. ఛరీష్ - సాత్విక ప్రేమించుకుంటారు. ఇద్దరూ సరదాగా గడపడం కోసం హిల్ ఏరియాలోని ఒక రిసార్ట్ కి వెళతారు. అదే సమయంలో ధనుశ్ - సౌపర్ణిక కూడా అదే రిసార్ట్ కి చేరుకుంటారు. సౌపర్ణికను చూడగానే ఛరీష్ మనసు పారేసుకుంటాడు. ఆమెను పరిచయం చేసుకోవాలని ఆ క్షణమే నిర్ణయించుకుంటాడు. అతను సౌపర్ణిక పట్ల ఆసక్తిని కనబరుస్తూ ఉండటాన్ని సాత్విక పసిగడుతుంది. అతనిలో తనకి నచ్చని విషయం అదేనని చెబుతూ, ఛరీష్ తీరుపట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తుంది. అనుకున్నట్టుగానే ఛరీష్ చాలా తక్కువ సమయంలోనే సౌపర్ణికకి దగ్గరవుతాడు. ఇద్దరూ కలిసి ఆ రిసార్ట్ చుట్టుపక్కలున్న కొండలు .. జలపాతాల దగ్గరకి వెళ్లడం మొదలుపెడతారు. సాత్వికతో ఛరీష్ కి బ్రేకప్ జరిగిందనీ, ప్యాచప్ చేయడం కోసమే వాళ్లు ఆ రిసార్ట్ కి వచ్చారని సౌపర్ణిక తెలుసుకుంటుంది. ఆమెకి ధనుశ్ తో ఎంగేజ్ మెంట్ జరిగిందనీ .. తండ్రి మాట కాదనలేక ఆమె ఒప్పుకుందని ఛరీష్ కి అర్థమవుతుంది. ఈ ఇద్దరి ధోరణి అటు సాత్విక - ధనుశ్ లకు అసహనాన్ని కలిగిస్తుంది. ఈ నేపథ్యంలోనే తన స్కూల్ డేస్ గురించి ఛరీష్ దగ్గర సౌపర్ణిక ప్రస్తావిస్తుంది. తన క్లాస్ మేట్ తనపై దొంగ అనే ముద్రవేసినట్టుగా చెబుతుంది. ఆ తరువాత కూడా అతను తన గురించి తెలుసుకుంటూ ఫాలో అవుతున్నాడని అంటుంది. రిసార్ట్ కి అతను కూడా వచ్చి, రహస్యంగా గమనిస్తున్నాడని చెబుతుంది.

అప్పుడు ఛరీష్ ఏం చేస్తాడు? సౌపర్ణికను వెంటాడే ఆ వ్యక్తి ఎవరు? వాళ్ల జీవితాలలో చోటుచేసుకునే సన్నివేశాలు ఎలాంటివి? అనేది మిగతా కథ.'మోద కవిదా వాతావరణ' అంటే,'మేఘాలు కమ్మిన వాతావరణం' అని అర్థం. రెండు జంటలు కొండ ప్రాంతంలోని ఒక రిసార్ట్ కి రావడం. ఆ జంటలోని ఛరీష్ .. ఈ జంటలోని సౌపర్ణిక చేరువ కావడం .. ఈ ఇద్దరి చుట్టూ చోటు చేసుకునే సన్నివేశాలతో ప్రధానమైన కథ మొదలవుతుంది. ఇలాంటి ఒక పరిస్థితి సహజమేకదా అని ప్రేక్షకులకు అనిపిస్తుంది. తన జీవితంలోని ఒక మిస్టరీ గురించి సౌపర్ణిక చెప్పడంతో, ఆడియన్స్ లో ఒక రకమైన కుతూహలం మొదలవుతుంది. ఇక్కడి నుంచి కథ కాస్త ఇంట్రెస్టింగ్ గా మారుతుంది. సౌపర్ణికతో ఛరీష్ పరిచయం .. ఆమెను ఆరాధించడం .. ఆమె జీవితంలోని రహస్య వ్యక్తి ఎవరనేది తెలుసుకోవడం కోసం చేసే ప్రయత్నాలతో ఆ తరువాత కథ కొనసాగుతూ ఉంటుంది. అతను తెలుసుకునే నిజాలు అటు కథను .. ఇటు ప్రేక్షకులను ఎలా ప్రభావితం చేస్తాయి? అంటే, పెద్దగా ప్రభావితం చేయలేకపోయాయనే చెప్పాలి. కొండలు .. జలపాతాలు .. మేఘాలు కమ్మిన వాతావరణం .. ఇవన్నీ చూసిన ప్రేక్షకులు, ఇక్కడ ఒక రొమాంటిక్ కథను .. రొమాన్స్ తో కూడిన సన్నివేశాలు ఆశిస్తారు. అలాంటివారిని నిరాశపరిచే కంటెంట్ ఇది. రెండు జంటలలో ఒక జంట నామ మాత్రంగా మాత్రమే కనిపిస్తుంది. ఒక మిగిలిన జంట వైపు నుంచి కూడా ఫీల్ తో కూడిన లవ్ ట్రాక్ ఉండదు. హీరోయిన్ కి ఉన్న ఒక సమస్య .. దానిని సాల్వ్ చేయడం కోసం హీరో పడే తపనతోనే కథ ముగిసిపోతుంది. కథను బలంగా అల్లుకోలేదు .. కథలో బలం లేకపోవడం వలన, సన్నివేశాలు కూడా పేలవంగానే అనిపిస్తాయి. హీరో - హీరోయిన్స్ వైపు నుంచి ఉన్న ఫ్లాష్ బ్యాక్ లు కూడా తేలికగా అనిపిస్తాయి. లవ్ .. ఎమోషన్స్ ఎక్కడా కనెక్ట్ కావు. కొంత సమయం వరకూ సాగుతూ వచ్చిన సస్పెన్స్, ఎప్పుడైతే రివీల్ అవుతుందో అప్పటి నుంచి ఆడియన్స్ ఊహకి అందేలా సన్నివేశాలు సాగుతుంటాయి. అందమైన లొకేషన్స్ లో .. సాగదీసే సంభాషణలతో నడిచే రొటీన్ స్టోరీగానే చెప్పుకోవలసి ఉంటుంది.ప్రధానమైన పాత్రలు రెండే అని చెప్పాలి. మిగతా పాత్రలు ఇలా వచ్చేసి అలా వెళుతూ ఉంటాయి. నటీనటుల నటన గురించి చెప్పుకునేంత స్థాయిలో ఆ పాత్రలను మలచలేదు. ఫొటోగ్రఫీ బాగుంది .. నేపథ్య సంగీతం ఫరవాలేదు. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తుంది. సింపుల్ లైన్ ను సింగిల్ షెడ్యూల్ లో ఊర్తి చేసినట్టుగా అనిపిస్తుందే తప్ప, ఎక్కడా ఎలాంటి ఫీల్ ను కనెక్ట్ చేయలేకపోయిన కంటెంట్ గా చెప్పుకోవలసి ఉంటుంది.

# నిధి అగర్వాల్ కొత్త సినిమా..

## - ఈసారి ఏకంగా మైథలాజికల్ థ్రిల్లర్!



హీరోయిన్ నిధి అగర్వాల్ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈసారి ఆమె ఓ విభిన్న కథతో అలరించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుందని సినీ వర్గాల సమాచారం. హీరోయిన్ ప్రధానంగా సాగే ఈ కథలో ఆమె ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా ఆ సంస్థకు తొలి ప్రొడక్షన్. సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. నిధి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. అదే రోజు చిత్రీకరణ కూడా మొదలైంది. సినిమా ప్రారంభోత్సవంలో పి. అశోక్, పి. రేణుక తొలి షాట్‌కు కెమెరా స్విచాన్ చేశారు. నిధి అగర్వాల్ చిత్రబృందంతో కలిసి కార్యక్రమంలో పాల్గొంది. ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్', పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీర మల్లు' చిత్రాల్లో నిధి నటనకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సినిమా ప్రారంభం సందర్భంగా మేకర్స్ నిధి ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. అందులో ఆమె ఒక చేతిలో దీపం పట్టుకుని.. మరో చేతితో దానికి రక్షణగా నిలిచినట్లు కనిపిస్తోంది. వెనుక భాగంలో అనేక చేతులతో ఉన్న దేవత ఆకారం కనిపిస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి హీరోయిన్ చుట్టూ తిరిగేలా బలమైన కథను సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.



# అలా చేస్తే కెరీర్ వేరేలా ఉండేది

'డాక్టర్ కావాలనుకొని యాక్టర్ అయ్యాను' అని చాలామంది హీరోయిన్లు చెబుతుంటారు. సాయిపల్లవి, శ్రీలీల లాంటి హీరోయిన్లయితే.. డాక్టర్ చదివి కూడా యాక్టర్లయిపోయారు. మలయాళ మందారం ఐశ్వర్య లక్ష్మి కూడా వారి దారిలోనే డాక్టర్ చదివి యాక్టరై విజయాలను అందుకుంటున్నది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'అనుకున్నది జరక్కపోవడమే జీవితం. నన్ను డాక్టర్‌గా చూడాలని మా అమ్మానాన్నల కోరిక. నేను కూడా కష్టపడి హౌస్ సర్జన్ చేశాను. ప్రాక్టీస్ మొదలుపెడితే నా కెరీర్ వేరేలా ఉండేదేమో. కానీ నేను అనుకోకుండా మోడలింగ్ వైపు మళ్లాను. తర్వాత సినిమా పిలిచింది. తొలినాళ్లలో అమ్మానాన్నకు నా ప్రవర్తన మింగుడు పడలేదు. విజయాలు రావడం, నా నటనను అంతా మెచ్చుకోవడం.. ఇవన్నీ చూసి వాళ్లు కూడా సైలెంట్ అయిపోయారు' అంటూ ఐశ్వర్య లక్ష్మి చెప్పుకొచ్చింది. సాయిదుర్గతేజ్‌కు జోడీగా ఆమె నటించిన 'సంబరాల ఏటిగట్టు' సినిమా



# నిశ్శబ్ద విధ్వంసం

సాధారణంగా స్టార్ హీరోల ఇంట్రోస్ అంటే తెరపై ఓ రేంజ్ హంగామానే సృష్టిస్తారు దర్శకులు. భారీ డీజే సౌండ్ల మధ్య, రౌడీల హాహాకారాల మధ్య హీరో తెరపై ఎంట్రీ ఇస్తాడు. అంతే అభిమానుల్లో పూనకాలు మొదలవుతాయి. కానీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా శైలి ప్రత్యేకం. 'స్పిరిట్'లో ప్రభాస్ ఎంట్రీని ఆయన చాలా భిన్నంగా ప్లాన్ చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. సెంట్రల్ జైల్లో ఉన్నట్టుండి గందరగోళం చెలరేగడం.. ఖైదీలందరూ నియంత్రణ కోల్పోవడం.. పోలీసులు సైతం పరిస్థితిని అదుపు చేయలేకపోవడం.. ఈ విధ్వంసం మధ్య నిశ్శబ్దంగా ఓ హిందీ క్లాసిక్ సాంగ్ వింటూ సైలెంట్‌గా, సైకోటిక్‌గా ప్రభాస్ ఎంట్రీ ఇస్తారట. అయితే.. ఈ సన్నివేశంలో ప్రభాస్‌ని వెంటనే రివీల్ చేయకుండా, ఖైదీల కళ్లలో కనిపించే భయం ద్వారా ప్రభాస్ పాత్రకు ఎలివేషన్ ఇస్తూ, నిదానంగా ప్రభాస్‌ని రివీల్ చేస్తారట. ప్రభాస్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా చెప్పుకునేలా ఈ ఇంట్రడక్షన్ ఉంటుందని వినికిడి. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. సీనియర్ నటి కాంచన, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్‌రాజ్ ఇందులో కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, నిర్మాణం: టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్.

# హృద్యమైన ప్రేమకథ



అనీష్, అనస్వర రాజన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. మహేష్ ఉప్పల దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ఈ సినిమా నుంచి 'చిన్ని చిన్ని' అనే పాటను విడుదల చేశారు. తమన్ స్వరపరచిన ఈ పాటను కల్యాణ్ చక్రవర్తి రచించారు. మోహిత్‌చౌహాన్ ఆలపించారు. అందమైన ప్రేమభావనలకు అద్దంపడుతూ ఈ పాట సాగింది. విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని వాట్ నెక్స్ట్ పతాకంపై వెంకీ కుడుముల తెరకెక్కిస్తున్నారు.

# నాన్‌స్టాప్‌గా 'రాపో23'

హీరో రామ్ పోతినేని స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న తాజా చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. 'రాపో23' వర్కింగ్ టైటిల్‌తో సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే పుదుచ్చేరి శివార్లలో 24 గంటల పాటు నిర్విరామంగా ఈ సినిమా షూటింగ్‌ను జరిపారు. హీరోగా, దర్శకుడిగా ఈ సినిమా కోసం రామ్ ఎంతగానో శ్రమిస్తున్నారని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారని యూనిట్ వర్గాలు తెలిపాయి.ద'పుదుచ్చేరిలో వేసిన భారీ సెట్‌లో తొమ్మిది రోజుల పాటు షూటింగ్ జరిపాం. ఇటీవల వర్షాల కారణంగా షెడ్యూల్‌కు బ్రేకపడింది. త్వరలో మళ్లీ షూటింగ్‌ను మొదలుపెడతాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, నిర్మాత:కృష్ణ పోతినేని.



# మోహన్ లాల్ సినిమా వివాదం..

## శబరిమలలో షూటింగ్‌లను నిషేధించిన ప్రభుత్వం!




ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమలలో సాధారణ చలనచిత్రాల షూటింగ్‌లను అనుమతించేది లేదని కేరళ దేవదాయశాఖ శాఖ మంత్రి కె. మురళీధరన్ స్పష్టం చేశారు. మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ హీరోగా, తరుణ్ మూర్తి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'అతిమనోహరం' చిత్రానికి శబరిమలలో షూటింగ్ నిర్వహించుకోవడానికి ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు అనుమతి ఇవ్వడం పెద్ద వివాదానికి దారితీసింది. పంబా నుండి సన్నిధానం వరకు షూటింగ్ జరుపుకోవడానికి కఠిన నిబంధనలతో కూడిన అనుమతులు జారీ అయినప్పటికీ, అటవీ శాఖ ఇందుకు సమ్మతించకపోవడంతో ఆ షెడ్యూల్ నిలిచిపోయింది. అయితే ఈ పరిణామాలపై స్పందించిన మంత్రి మురళీధరన్, ఆలయాల్లో సాధారణ సినిమాల షూటింగ్‌లకు అవకాశం ఇవ్వడం ప్రభుత్వ విధానం కాదని తేల్చిచెప్పారు. కేవలం స్వామి అయ్యప్పకు సంబంధించిన భక్తి చిత్రాలకు మరియు మతపరమైన సినిమాలకు మాత్రమే ఆలయ పరిసరాల్లో మినహాయింపు ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. దేవుని సన్నిధిని సాధారణ సినిమా షూటింగ్ లొకేషన్‌గా మార్చలేమని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ చిత్రంలో మోహన్ లాల్ సరసన మీరా జాస్మిన్ నటిస్తుండగా, లాలూ అలెక్స్, మనోజ్ కె. జయన్, జగ్దీష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా మరోవైపు పవిత్రమైన పుణ్యక్షేత్రాల పవిత్రతను కాపాడేలా ప్రభుత్వాలు మరియు బోర్డులు కఠిన నిబంధనలు అమలు చేయాలని భక్తుల నుండి డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

# తెలంగాణ నేపథ్య ప్రేమకథ



మోహిత్ పెడాడ, శృతి శంకర్, సాయికుమార్, తనికెళ్ల భరణి, ఆమని ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న తెలంగాణ నేపథ్య ప్రేమకథ '2కె లవర్స్'. రాజేశ్ నాయుడు దర్శకత్వంలో బిచ్చు నాయక్ నిర్మిస్తున్న ఈ చిత్రం సోమవారం ప్రారంభమైంది. దర్శకుడు వీఎన్ ఆదిత్య ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇవ్వగా, సంగీత దర్శకుడు మణిశర్మ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ ప్రేమకథలో భావోద్వేగాలు బలంగా ఉంటాయని దర్శకుడు రాజేశ్ నాయుడు తెలిపారు. తెలంగాణ నేపథ్యంలో ఇంత వరకూ చూడని ప్రేమకథ ఇదని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి రచన: రసూల్, సంగీతం: మణిశర్మ, కెమెరా: పవన్, నిర్మాణం: ఎంబీ ప్రొడక్షన్స్.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హనీ వెల్ కంపెనీ వారి సౌజన్యంతో భారత్ కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఎఐ సైబర్ సెక్యూరిటీ పైన మెంటర్ నవీన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో 30 మంది విద్యార్థులు వివిధ సర్టిఫికెట్ కోర్సులలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ తోపాటు నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకుని పోటీ యుగంలో రాణించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టాస్క్ కోఆర్డినేటర్ అయిన డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ డిగ్రీతో పాటు ఉపాధి కొరకు ఈ స్కిల్స్ ఉపయోగపడతాయని తద్వారా మంచి భవిష్యత్తు పొందుతారని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం అధ్యాపకేతర బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మెదక్ మిల్లి అసోసియేషన్


## సౌజన్యం తో కుట్టు శిక్షణ శిబిరం ఏర్పాటు



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మహిళలకు ఉపాధి తో పాటు, స్వయం శక్తి తో ఏదగడానికి కుట్టు శిక్షణ ఎంతో దోహదపడుతుంది అని మెదక్ మిల్లి అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఉమర్ ఖాన్, సుప్రీమ్ బాడీ మెంబర్ మీర్ జాఫరుల్లా తహెర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సయ్యద్ సదత్ అలీ జకీ, జాయింట్ సెక్రటరీ మహమ్మద్ రియజోద్దీన్, ఖాజా సిద్దిక్ మయ్యొద్దీన్, అన్నారు. మంగళవారం నాడు మండల కేంద్రమైన కొల్చారం లో మెదక్ మిల్లి అసోసియేషన్ సౌజన్యం తో కుట్టు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి మెదక్ మిల్లి అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఉమర్ ఖాన్, జయింట్ సెక్రటరీ రియజోద్దీన్, జాఫరుల్లా తహెర్ లు ముఖ్య అతిథులుగా హాజరై, శిక్షణ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అంతరం వారు మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తి తో ఎదగడానికి కుట్టు శిక్షణ శిబిరం ఎంతో దోహదపడుతుంది అన్నారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తారని, మూడు నెలల నిర్ణిత గడువులో శిక్షణ పూర్తి అవుతుందని తెలిపారు. కులమతాలకు అతీతంగా ఎవరైనా తమ పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ పూర్తి అయిన తర్వాత సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెలే నజీమా, ఇంచార్జి సానియా సమీరా, శిక్షకులు హైమాది బేగం, స్థానికులు అరిఫోద్దీన్, ఖదీర్, హైమద్, సమీర్, ఆర్షద్, తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

## ఆంజనేయులు గౌడ్, మల్లేశం గౌడ్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకొని నర్సాపూర్ పట్టణంలో ఆయన విగ్రహానికి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మెదక్ బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడి, మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన తొలి తెలంగాణ బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కులు, సామాజిక సమానత్వం, స్వేచ్ఛ కోసం పాపన్న గౌడ్ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.సమాజంలో అసమానతలను రూపుమాపి, ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈమంత్రులకు చిత్తశుద్ధి ఉంటే సీఎంను కుర్చీ దించాలే...

- ఉన్న పథకాలను ఊడగొట్టాలనే కుట్రలు చేస్తుండ్లు
- ప్రజాపాలన పేరుతో కొత్త పాలనకు తెరలేపిన కాంగ్రెస్
- 420హామీలు రాసిన మంథని ఎమ్మెల్యే జవాబు చెప్పాలే
- కోర్టుల్లో కేసులు వేయించి కౌంటర్ వేయని ప్రభుత్వం
- కమీషన్‌ల కోసమే కూల్చివేతలు చేస్తున్న ఎమ్మెల్యే దుద్దిళ్ల
- ప్రజల పక్షాన పోరాటం చేస్తే అణిచివేయాలని చూస్తుండ్లు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని ( ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దోపిడికి వత్తాసు పలికే మంత్రులకు చిత్తశుద్ధి, చీము నెత్తురు ఉంటే పథకాలను కొల్లగొడుతున్న ముఖ్యమంత్రిని కుర్చీ దించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కళ్యాణలక్ష్మి పై కాంగ్రెస్ కుట్రలకు నిరసనగా మంగళవారం మంథనిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా రాజగృహ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బారీ ర్యాలీగా వచ్చి, మహిళలు చౌరస్తాలో బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా లో ధర్నా నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 130ఏండ్ల చరిత్ర కల్గిన కాంగ్రెస్ పార్టీ చేతులకు మట్టి అంటకుండా ప్రజలను ఏ విదంగా మోసం చేయాలని చూస్తుందో అర్థం అవుతుందని, ప్రజాపాలన పేరుతో కొత్త పాలనకు తెరలేపిన కాంగ్రెస్ తమకు సంబంధం లేనట్లుగానే కోర్టుల ద్వారానే పథకాలు ఆగిపోతున్నయని కొత్త తరహాలో మోసం చేస్తున్నారని ఆయన వివరించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వం, పాలనలో దాడులు, కేసులు, దౌర్జన్యాలు, కూల్చివేతలు తప్ప అభివృద్ధికి నోచుకోని ఈ రాష్ట్రంలో మనం ఉండటం దౌర్భగ్యాంగా బావిస్తున్నట్లు చెప్పారు. మంథని నియోజకవర్గంలో ప్రజల ఓట్లతో గెలిచి 40ఏండ్లుగా ప్రజలను వంచిస్తున్న స్థానిక ఎమ్మెల్యే రాష్ట్రాన్ని ఏ విధంగా మోసం చేయాలనేది చూపించిన చరిత్రను చూస్తున్నామని అన్నారు. మా నాయన చదువుకున్న వాడు అనుభవం ఉంది స్పీకర్‌గా పని చేసిండ్లని మేం దేవుడికి భక్తుడికి అనుసంధానం తప్ప మోసం చేయని కులం మాది అని చెప్పుకుంటూనే నియోజకవర్గ ప్రజలను మోసం చేయడం సరిపోదని యావత్తు రాష్ట్ర ప్రజలు మోసం చేయాలని 420హామీలు రాసిన చరిత్ర మంథని ఎమ్మెల్యేదన్నారు. 420హామీల అమలుపై ఎన్ని సార్లు ప్రశ్నించినా ఇప్పటి వరకు జవాబు చెప్పడం లేదన్నారు. ఆనాడు ఆడబిడ్డల వద్దకు పోయిండు కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చాడని, కానీ ఇప్పటి వరకు తులం బంగారం ఇవ్వలేదని వాపోయారు. చదువుకున్న విజ్ఞానవంతుడివైతే 420హామీలకు మంథని ఎమ్మెల్యే జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మూడేళ్లు దగ్గర పడుతున్నా రాష్ట్రంలో ఒక్క పథకం కొత్తవి అమలు చేయకపోగా ఉన్న పథకాలు ఊడగొట్టడానికి కోర్టులో కేసులు వేయిస్తున్నారని, కేసులకు కౌంటర్‌లు కూడా వేయడం లేదన్నారు. నోటుకు నోటు కేసులో మాత్రం కోట్లు పెట్టి వకీళ్లను పెట్టుకునే ముఖ్యమంత్రి ప్రజలకు సంబందించిన పథకాలను అమలు చేయవద్దని చెప్పితే దానికి మాత్రం వకీళ్లను ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. వాళ్లే కేసులు వేయిస్తు పథకాలు రద్దు చేయాలని కుట్రలు చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి అంటే కాంగ్రెస్‌ది దోచుకోవడం దాచుకోవడమని అర్థమన్నారు.

ముఖ్యమంత్రి దోపకంలో మంత్రి వర్గం ప్రముఖ పాత్ర పోసిస్తుందని, పథకాలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి వద్ద పైసలు లేవు కానీ జూబ్లీ హిల్స్‌లో రూ.200కోట్లతో ప్యాలెస్, ఫోర్ట్‌సిటీ పేరు మీద రూ.200కోట్లతో భవనం కడుతున్నాడని, మనమడు పుట్‌బాల్ ఆడటానికి రూ.20కోట్లుతో గ్రౌండ్, మరో రూ.20కోట్లతో స్విమ్మింగ్‌పూల్ కట్టిస్తున్నాడని, వీటన్నిటిపై మంత్రులు ఎందుకు నోరు మెదుపడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి 420హామీలు రాసి ప్రజలను మోసం చేసిన మంథని ఎమ్మెల్యే అయినా పథకాలు అమలు చేద్దామని ముఖ్యమంత్రిని అడుగాలే కదా అని అన్నారు. బీసీబిడ్డ అయిన మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఎస్సీ మంత్రులు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని, పథకాలు అనుభవించేది 95శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ బిడ్డలే కదా అని ఆయన అన్నారు. పథకాలను కొల్లగొట్టాలని చూస్తున్న ముఖ్యమంత్రికి మంత్రులు వత్తాసు పలుకడం సిగ్గు చేటు అన్నారు. దుద్దిళ్ల శ్రీధర్ ఎప్పుడు అధికారంలో ఉంటే అప్పుడు ప్రతిపక్షాల గొంతు నొక్కాలని, వారిపై అక్రమ కేసులు పెట్టాలని చూస్తాడని అన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పి మోసం చేసి ఓట్లను దండుకోవాలని చూస్తున్నారే కానీ ప్రజలకు అవసరమైన పథకాలు,ఇచ్చిన హామీలు అమలు చేయాలని చూడటం లేదన్నారు.

మంథనిలో కూల్చివేయడంలో వచ్చే కమీషన్‌లో వచ్చే కమీషన్‌ల కోసమే పని చేస్తున్నారని, పథకాలు అమలు చేస్తే ఏమీ రావని, అన్న నిధులు సాంక్షన్ చేస్తే తమ్ముడు కమీషన్‌లు సంచుల్లో వేసుకుని వెళ్తున్నాడని ఆయన విమర్శించారు. వికలాంగులు వితంతులు ప్రభుత్వం మీద ఆధారపడి జీవిస్తారని, అలాంటి వారిని పించన్ పెంచుతమని ఆశపెట్టి మోసం చేసిండ్లని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 420హామీల రాసిన సన్నాసి ఎమ్మెల్యే కళ్యాణ లక్ష్మి తోపాటు తులం బంగారం ఏది అని ప్రశ్నించారు. ప్రజల కోసం ప్రజల పక్షాన పోరాటం చేస్తే అక్రమ కేసులు పెడుతున్నారని, ఊకదంపుడు కేసులకు భయపడేది లేదని, కేసులు పెట్టించడం ఆపి పథకాలు అమలు చేయాలని ఆయన హితవు పలికారు. ప్రజలతో బీఆర్ఎస్ పార్టీకి పేగు బంధమని, అందుకే ఆనాడు కేసీఆర్ కళ్యాణలక్ష్మి, దళితబంధు లాంటి పథకాలను అమలు చేశారని ఆడబిడ్డల ఆత్మగౌరవమే కళ్యాణలక్ష్మి....జక్కు శ్రీహర్షిణీ రాకేష్, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ పేద ప్రజల గురించి కొనియాడారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపిన ఆరుగురికి జైలు శిక్ష

## డ్రైవింగ్ లైసెన్స్ లేని మరో ఆరుగురికి రూ.30 వేల జరిమానా

## గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. సోమవారం గజ్వేల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులో గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన 10 మద్యం సేవించి వాహనం నడిపిన కేసులు విచారణకు వచ్చి పరిష్కరించబడ్డాయి.ఈ కేసుల్లో నిందితులకు మొత్తం రూ.40,000 జరిమానా విధించగా, ఆరుగురికి జైలు శిక్ష విధించారు. జైలు శిక్ష పొందిన వారిలో గొల్ల నరేష్ కుమార్ (39)కు 2 రోజులు, మదోత్ సంతోష్ (40)కు 3 రోజులు, జెర్రిపోతుల మహేష్ (24)కు 5 రోజులు, కొడవత్ అజయ్ కుమార్ (30)కు 5 రోజులు, బింగి సత్యనారాయణ (35)కు 4 రోజులు, మండల మధుసూదన్ రెడ్డి (38)కు 3 రోజుల జైలు శిక్ష విధించారు.అదేవిధంగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 6 కేసులు కూడా కోర్టులో పరిష్కరించబడ్డాయి. ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.30,000 జరిమానా విధించారు.మొత్తంగా 16 కేసులు పరిష్కరించగా, రూ.70,000 జరిమానా విధించబడింది. ఇందులో మద్యం సేవించి వాహనం నడిపిన కేసులు 10 కాగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన కేసులు 6 ఉన్నాయి.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపవద్దని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని ఆయన సూచించారు.

# జనగణనలో ఓబిసిలను ప్రత్యేక క్యాటగిరిగా చేర్చుతూ సవరణ గెజిట్ విడుదల చేయాలి


## సామాజిక మాధ్యమం ఎక్స్ లో ప్రధాని మోడీని కోరిన టిజిఎస్ రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



హైదరాబాద్( ప్రశ్న న్యూస్) జనగణనలో ఓబిసిలను ప్రత్యేక క్యాటగిరిగా చేర్చుతూ సవరణ గెజిట్ విడుదల చేయాలని ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ లో ప్రధాని మోడీని కోరిన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మీడియాతో మాట్లాడుచూ కులగణనలో ఓబిసిల సమగ్ర వివరాల నమోదుకు సవరణ ఉత్తర్వులివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు 2025 లో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కులగణన చేపడతామని ప్రకటించి తాజాగా విడుదల చేసిన జనగణన గెజిట్లో 40 ప్రశ్నలలో ఓబిసిల ప్రస్తావన లేకుండా కేవలం ఎస్సి ఎస్టిలను మాత్రమే ప్రత్యేక క్యాటగిరిగా పేర్కొనడం పై కేంద్ర ప్రభుత్వం ఓబిసిల పట్లా అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వెంటనే ఓబిసిలను ప్రత్యేక క్యాటగిరిగా గుర్తిస్తూ సవరణ ఉతర్వులు ఇవ్వాలన్నారు లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ఓబిసిలను సంఘటితం చేసి ఐక్య ఉద్యమాలు చేస్తామన్నారు

# మద్దూర్ కేజీబీవీలో ఫుడ్ పాయిజన్ ఘటనపై విద్యార్థుల పరామర్శ

## యూఎస్ఎఫ్ఐ, సిద్దిపేట జిల్లా కార్యదర్శి గుడికందుల రవి



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) భోజనం కలుషితమై అస్వస్థతకు గురైన మద్దూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థులను భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) సిద్దిపేట జిల్లా కార్యదర్శి గుడికందుల రవి పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వంటగదికి సమీపంలో గత రెండేళ్లుగా మురుగునీటి కాలువ లీకేజీ అవుతూ తీవ్ర దుర్వాసన వస్తోందని విద్యార్థులు తెలిపారు. ఈ సమస్యపై విద్యాశాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు.వసతి గృహంలో పారిశుద్ధ్య లోపాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుడికందుల రవి అన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగునీటి కాలువ సమస్యను తక్షణమే పరిష్కరించి, పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

## గజ్వేల్ సిఐ రవికుమార్, ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్) గజ్వేల్ పట్టణంలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హైస్కూల్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం, పోలీసుల సమన్వయంతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ,పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలను తెలుసుకుని పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.అలాగే జీబ్రా క్రాసింగ్ వద్ద పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, రోడ్డు దాటేటప్పుడు ఇరువైపులా చూసి జాగ్రత్తగా దాటాలని వివరించారు.విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రజలకు కూడా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు "ట్రాఫిక్ నియమాలను పాటిస్తాం – బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరిస్తాం – రోడ్లను అందరికీ సురక్షితంగా మారుస్తాం" అంటూ రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు."సురక్షితమైన రోడ్లు – సురక్షితమైన జీవితాలు – సురక్షితమైన కుటుంబాలు" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, రోటరీ ఇంటరాక్ట్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కల్తీలపై కొరడా ఝుళిపిస్తున్న హెచ్- ఫాస్ట్

**- హైదరాబాద్‌లో కల్తీ నెయ్యిపై భారీ ఆపరేషన్ - 130 తయారీ కేంద్రాల్లో తనిఖీలు**

**- 36 టన్నుల కల్తీ నెయ్యి సీజ్ - కల్తీ నెయ్యి అమ్మితే కఠిన చర్యలు తప్పవు - సీపీ సజ్జనార్**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భాగ్యనగరంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నకిలీ నెయ్యి తయారీ, విక్రయ ముఠాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. స్వచ్ఛమైన దేశీ నెయ్యి పేరుతో మార్కెట్‌లో యథేచ్ఛగా సాగుతున్న భారీ కల్తీ దందాను అధికారులు బహిర్గతం చేశారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా సాగిన ఈ విస్తృత దాడుల్లో ఏకంగా 36 టన్నుల అపరిశుభ్ర, కల్తీ నెయ్యితో పాటు, దాని తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు, ప్రమాదకర రసాయనాలను సీజ్ చేసినట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు.

### - 130 స్థావరాలపై దాడులు..

విశ్వసనీయ సమాచారం, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 'హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వేలెన్స్ టీమ్' (హెచ్-ఫాస్ట్), ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు సంయుక్తంగా ఈ ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. నగరవ్యాప్తంగా ఉన్న 39 నెయ్యి తయారీ యూనిట్లు, 91 విక్రయ కేంద్రాలతో కలిపి మొత్తం 130 ప్రాంగణాల్లో అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ స్పష్టం చేశారు. తనిఖీల సమయంలో అధికారులకు షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. నాసిరకం పదార్థాలు, శరీరానికి తీవ్ర హాని కలిగించే అనుమతి లేని రసాయనాలను క్రమబద్ధంగా కలిపి కృత్రిమ నెయ్యిని తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడుల్లో భాగంగా 36 టన్నుల కల్తీ నెయ్యి, మీగడ (ముడి సరుకు), పామాయిల్, వనస్పతి, కృత్రిమ నెయ్యి సువాసనలు తెచ్చే రసాయనాలు, స్టార్చ్, ఇతర కెమికల్ అడిటివ్స్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు జప్తు చేశాయి. ఘటన స్థలంలోనే ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు ల్యాబ్ పరీక్షల కోసం నమూనాలను సేకరించారు. "కల్తీ మిశ్రమాన్ని '100% ప్యూర్ దేశీ నెయ్యి' అనే ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో సాధారణ ప్రజలకు విక్రయిస్తున్నారు. ఇది ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగిస్తుంది," అని సీపీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. అసలైన నెయ్యి రుచి, సువాసన, రంగును కృత్రిమంగా రప్పించడానికి కొందరు తయారీదారులు పామాయిల్, వనస్పతి, స్కిమ్డ్ మిల్క్ పౌడర్, స్టార్చ్, కెమికల్ ఫ్లేవర్లను వాడుతున్నారని సీపీ సజ్జనార్ వివరించారు. చివరికి కొన్ని ఉత్పత్తుల్లో అసలు పాలకు సంబంధించిన ఏ ఒక్క పదార్థం కూడా లేకపోవడం గమనార్హం.

### - బాధ్యతారాహిత్యంగా ప్యాకింగ్, విక్రయాలు..

ఈ కల్తీ ఉత్పత్తులను పారదర్శక కవర్లలో ప్యాక్ చేసి "100% స్వచ్ఛమైన నెయ్యి", "ప్రీమియం నెయ్యి", "ఫార్మ్ ఫ్రెష్ నెయ్యి", "నేచురల్ నెయ్యి" అనే పేర్లతో మార్కెట్‌లో విక్రయిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ డిసిపి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఈ ప్యాకెట్లపై కనీస నిబంధనలైన బ్యాచ్ నంబర్, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ వివరాలు, తయారీ మరియు గడువు ముగిసే తేదీలు, క్వాలిటీ సర్టిఫికేట్ వంటివి ఏవీ ముద్రించలేదని ఆయన వెల్లడించారు. కల్తీ శాతాన్ని బట్టి (10 శాతం నుంచి 40 శాతం వరకు) ఈ నకిలీ నెయ్యిని వేర్వేరు వ్యాపారాలకు మళ్లించేవారని దర్యాప్తులో తేలింది. తక్కువ కల్తీ ఉన్నదాన్ని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ షాపులు, ఆయుర్వేద దుకాణాలకు సరఫరా చేస్తుండగా, తీవ్రంగా కల్తీ చేసిన నెయ్యిని పూజల కోసం వాడే నెయ్యిగా మార్కెట్‌లోకి వదిలారు. ఈ తయారీకి కావాల్సిన పాల మీగడను మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి తెప్పించుకునేవారని పోలీసులు తెలిపారు.

చవకైన ప్రత్యామ్నాయ పదార్థాలతో అతి తక్కువ ఖర్చుతో ఈ నకిలీ నెయ్యిని తయారు చేసి, మార్కెట్‌లో అసలైన నెయ్యి ధరలకు అమ్మి అక్రమార్కులు భారీగా లాభాలు గడించారని పోలీసులు పేర్కొన్నారు. ఈ కల్తీ నెయ్యిని కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా, పొరుగు రాష్ట్రాలకు కూడా సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై కేసులు నమోదు చేసే ప్రక్రియ వేగంగా జరుగుతోందని సీపీ సజ్జనార్ వివరించారు.

### - కల్తీ ఆహారపదార్థాలతో ప్రజారోగ్యానికి గండి

ఆహార పదార్థాలను విచ్చలవిడిగా కల్తీ చేస్తూ కొంతమంది అక్రమార్కులు సమాజంపై నిశ్శబ్ద దాడికి దిగుతున్నారు. రసాయనాలు, నాణ్యత లేని కల్తీ ఆహారపదార్థాలతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపాలన్న ప్రభుత్వ ఆదేశాలతో కల్తీ రాయుళ్లపై హెచ్?-ఫాస్ట్? కొరడా ఝుళిపించింది. ఇటీవల ఫుడ్?సేఫ్టీ అధికారులు పలు హోటళ్లలో నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పరిశుభ్రత లేని ఆహారపదార్థాలు, బొద్దింకలు లాంటివి దర్శనమిచ్చాయి.

# ప్రభుత్వ డ్యూటీనా.. ప్రైవేటు హాస్పిటల్‌లో సేవలా.?

**చిన్నపిల్లల వైద్యుడి వ్యవహారంపై ప్రశ్నలు..**

**ప్రైవేట్ హాస్పిటల్‌లోనే ఎక్కువ సమయం.?**



మెదక్(ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తికే ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు యాజమాన్యంతో సంబంధం ఉందని, దానితో ప్రభుత్వ హాస్పటల్ లో సేవలు పక్కకు పెట్టి ప్రైవేటు హాస్పిటల్ లోనే ఎక్కువ వైద్య సేవలు అందిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించే సమయంలోనే ప్రైవేట్ హాస్పిటల్‌లోనూ వైద్యం ఎలా అందిస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను ప్రైవేటు హాస్పిటల్ కు మన్నిస్తున్నట్లు దానితో తరచూ పేషెంట్లు ప్రైవేట్ హాస్పిటల్ వద్ద కనిపిస్తుండటంతో ప్రభుత్వ ఆస్పత్రి కంటే ప్రైవేటు హాస్పిటల్‌లోనే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జిల్లా ఆరోగ్యశాఖ అధికారి పూర్తిస్థాయి విచారణ చేయించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని అదే కాకుండా ఇలా జరిగితే అధికారిని వెంటనే ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ ఆస్పత్రి డ్యూటీ, మరోవైపు ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యం, రెండు చోట్ల విధులు ఎలా సాధ్యమవుతున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఆరోపణలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ జరిపి, డాక్టర్ డ్యూటీ సమయాలు, హాజరు రికార్డులు, సీసీటీవీ ఫుటేజీవులు ప్రైవేట్ ప్రాక్టీస్‌కు సంబంధించిన నిబంధనలు పరిశీలించి వాస్తవాలను తెలపాలని ప్రజలు కోరుతున్నారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమ

**- అభ్యర్థుల ఎంపికకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత వర్ల రామయ్య, అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను శాసనమండలికి నామినేట్ చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న పండుల రవీంద్రబాబు, జాకియా ఖానమ్‌ల పదవీకాలం ముగియడంతో ఈ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అధికార టీడీపీ, పార్టీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ఇద్దరు నేతలకు అవకాశం కల్పించింది. దళిత వర్గానికి చెందిన వర్ల రామయ్య పార్టీలో కీలక నేతగా, గతంలో ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2009లో తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు.

మరోవైపు, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవి బీసీ (వడ్డెర) సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు. రెండు దశాబ్దాలుగా ఆమె పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె కుటుంబం మొదటి నుంచి టీడీపీకి అండగా నిలుస్తోంది. 2021లో అనంతపురం కార్పొరేటర్‌గా పోటీ చేసిన రమాదేవి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషంగా కృషి చేశారు. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా నేతకు పదవులు ఇవ్వడం ద్వారా టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన సందేశం పంపినట్టయింది. ప్రస్తుతం ఈ ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉండగా, ఆయన ఆమోదముద్ర వేయగానే వీరి నియామకం అధికారికంగా ఖరారు కానుంది.

# తెలంగాణలో 22ఏ భూప్రకంపనలు

**- పొంగులేటిని టార్గెట్ చేస్తున్న విపక్షాలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ల వ్యవహారం మరోసారి తీవ్రమైన చర్చనీయాంశమైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో లక్షలాది ప్రైవేటు ఆస్తులు అకస్మాత్తుగా 22ఏ(నిషేధిత జాబితా)లోకి చేరడంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తమ సొంత భూములు, అపార్టమెంట్‌లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిషేధిత జాబితాలో ఉండటంతో క్రయవిక్రయాలు నిలిచిపోయి ప్రజలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### - అసలు ఏంటీ 22ఏ వివాదం

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ప్రైవేటు వ్యక్తులకు చెందిన భూములను, ఆస్తులను అధికారులు 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు. దీని వల్ల ఆ ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. చాలా చోట్ల ప్రభుత్వం విక్రయించిన ప్లాట్లు, హెచ్ఎండీఏ లేఅవుట్లు కూడా ఈ జాబితాలో ఉంచారు.

### - నిషేధిత జాబితాలో ప్రైవేటు భూములు ఎలా వచ్చాయి.?

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరణ ప్రకారం, ఇది ప్రధానంగా అధికారుల పొరపాటు వల్ల జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి ప్రభుత్వ జీవోలు, మెమోల ద్వారా హక్కులు పొందిన భూములకు సంబంధించిన రికార్డులు ఆన్‌లైనలో అప్‌లోడ్ కాకపోవడమే దీనికి ప్రధాన కారణం. గతేడాది హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ జాబితాను కలెక్టర్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాకపోవడమ దీనికి ప్రధాన కారణం. గతేడాది హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ జాబితాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినప్పుడు పాత వివరాలు కూడా అందులో ఉండంతో ఈ సమస్య తలెత్తింది. కోర్టు ఆదేశాలను సరిగ్గా ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్ల ప్రైవేటు ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్లాయని ప్రభుత్వం పేర్కొంది. ఇటీవల కాలంలో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రక్షాళన చేస్తున్న క్రమంలో, పెద్ద ఎత్తున ప్రైవేటు ఆస్తులు రిజిస్ట్రేషన్లకు నిరాకరించడంతో ఈ అంశం తెరపైకి వచ్చింది. ప్రభుత్వం పన్నుల వసూలు చేసిన తర్వాత, రిజిస్ట్రేషన్ సమయంలో ఆ భూమి నిషేధిత జాబితాలో ఉందని చెప్పడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది.

### - ప్రభుత్వం చర్యలు, పరిష్కార మార్గాలు

ప్రజల ఆస్తులకు ఆటంకం కలిగించడం తమ ప్రభుత్వ విధానం కాదని మంత్రి పొంగులేటి భోసా ఇచ్చారు. ఈ సమస్యను పరిష్కించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రెవెన్యూ ప్రన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ లోకేష్ కుమార్‌తో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ రాబోయే 15 రోజుల పాటు ప్రతిరోజూ సమస్యలను సమీక్షిస్తుంది. ప్రజలు తమ ఫిర్యాదులను తెలియజేయడానికి 18005994788 అనే టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. నెలాఖరుకు జెన్యూన్ కేసులన్నింటినీ పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అధికారుల వల్ల జరిగిన తప్పిదానికి తాను క్షమాపణలు చెబుతున్నట్టు ప్రకటించారు.

### - పొంగులేటి రాజీనామాకు డిమాండ్

ప్రతి పనిలో కమీషన్లు తీసుకుంటున్న ప్రభుత్వం ఇప్పుడు సామాన్యుల భూములపై పడిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ లీడర్ హరీష్‌రావు ఆరోపించారు. నిషేదిత జాబితాలో చిక్కుకున్న భూములు రిలీజ్ చేయాలంటే 30 శాతం కమీషన్ ప్రజల నుంచి వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములను అక్రమంగా లాక్కునేందుకు ప్రయత్నించి తప్పును అధికారులపైకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వాని కంటే ఈ ప్రభుత్వంలో భూదోపిడీ రెండు రెట్లు పెరిగిందని ఆరోపించారు మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్. ప్రభుత్వం వేసిన లేఅవుట్‌లను కూడా 22ఏలో చేర్చి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారంటే కచ్చితంగా ఈ వ్యవహారంలో మాఫియా హస్తం ఉందని ఆరోపించారు. ప్రజల భూములను అన్యాయంగా లాక్కోవాలని చూస్తే ప్రభుత్వంపై తిరగబడతామని టీఆర్ఎస్ చీఫ్ కవిత హెచ్చరించారు. తాము అధికారంలోకి వస్తే భూలక్ష్మి పథకం కింద ప్రతి కుటుంబానికి ఎకరా భూమి పంపిణీ చేస్తామని ప్రకటించారు. త్వరలో ప్రారంభమయ్యే అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ సమావేశాల్లో ఉద్యోగ సమస్యతోపాటు ఈ 22ఏ వివాదం కూడా సభను షేక్ చేసే ఛాన్స్ గట్టిగానే కనిపిస్తోంది.

# యూఏఈలో మొబైల్స్‌కు మిస్సైల్ దాడి హెచ్చరికలు!

**- ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని మొబైల్ అలర్ట్**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో మంగళవారం తీవ్ర కలకలం రేగింది. దేశంపై క్షిపణి ముప్పు పొంచి ఉందంటూ ప్రభుత్వం ప్రజల మొబైల్ ఫోన్లకు అత్యవసర సందేశాలను పంపింది. అయితే, తమ గగనతల రక్షణ వ్యవస్థలు ఈ ముప్పును సమర్థవంతంగా అడ్డుకున్నాయని, ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలోనే ఉందని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. యూఏఈ నివాసితులకు మంగళవారం వారి మొబైల్ ఫోన్లలో 'పొటెన్షియల్ మిస్సైల్ థ్రెట్' పేరుతో అత్యవసర సందేశాలు అందాయి. వెంటనే సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, కిటికీలు, తలుపులకు దూరంగా ఉండాలని ప్రభుత్వం ఆ సందేశాల్లో సూచించింది. దీంతో ప్రజల్లో కొంత ఆందోళన నెలకొన్నప్పటికీ, కొద్దిసేపటికే ముప్పు తొలగిపోయిందని, అంతా సురక్షితమని ప్రభుత్వం నుంచి మరో సందేశం రావడంతో పరిస్థితి సద్దుమణిగింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన క్షిపణి ముప్పును గుర్తించినట్లు యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఆ సమయంలో వినిపించిన భారీ శబ్దాలు రక్షణ వ్యవస్థల ప్రతిచర్యల వల్లే సంభవించాయని వివరించింది. దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు తాము సర్వసన్నద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించింది. గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ ప్రయోగించిన నాలుగు బాలిస్టిక్ క్షిపణులు, 25 డ్రోన్లను యూఏఈ రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈ ప్రాంతంలో వివాదాలు ప్రారంభమైనప్పటి నుంచి యూఏఈలో ఇటువంటి ముందస్తు హెచ్చరికల వ్యవస్థ అమల్లో ఉంది. గతంలోనూ పలుమార్లు ఇలాంటి హెచ్చరికలు జారీ కాగా, జూలై మధ్య కాలం తర్వాత మళ్లీ ఇప్పుడే ఇటువంటి ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588